57403
57404

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

మార్చి 28, 2010

కథా నిలయం
శ్రీకాకుళం
కథా నిలయం
Entered
శ్రీకాకుళం

హక్కుల మంత్రం మారణ తంత్రం

హ్యాపీ బర్త్‌డే

(2010 మార్చి 28 నుంచి
2010 ఏప్రియల్ 3 వరకు)

డి. శివరామ ప్రసాద్
మార్చి-28
కల్పన, బాలకృష్ణ
నాగర్‌కర్నూల్

కొండవల్లి శ్రావ్య
ఏప్రియల్1, 2008
రాధిక-రమేష్
పామర్రు-కృష్ణాజిల్లా

సౌమ్య (సోని)
మార్చి28, 2007
బి.పద్మ - శ్రీనివాసరావు
జియ్యమ్మవలస-విజయనగరం

సాత్విక్
మార్చి29
సుజాత-రామకృష్ణ
పోచంపల్లి - నల్గొండ

టి. సుమంత్ (చిన్ను)
మార్చి-31, 2000
పద్మ-వీరారెడ్డి
విద్యానగర్ - నల్గొండ

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

ENTERED
కథా నిలయం
శ్రీకాకుళం

మనలో మాట

వేసవి కాలం!



పేరుకే ఎండాకాలం. నిజానికి పరీక్షల కాలం. పిల్లలకేనా! పెద్దలకూ పరీక్షా సమయమే. చిన్నారులను చదివించడం, మెరుగైన ఆహారం ఇవ్వడం, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం... చిన్న విషయమా! తామే స్వయంగా పరీక్షలు రాసినంతపని!

పరీక్షల పర్వం పూర్తయితే సెలవుల సందడి షురూ! ఎండలు, చెమటలు హుష్ కాకి. పట్టించుకునే ప్రసక్తే లేదు. విహారయాత్రలు, ఊళ్ల ప్రయాణాలు మొదలు. పిల్లలైతే ఏకంగా ఒక ప్రణాళిక తయారుచేసేస్తారు. అమ్మమ్మ, నానమ్మ, పెద్దమ్మ, పిన్నమ్మల ఇళ్లల్లో ఎన్నెన్ని రోజులుండాలో చెప్పేస్తారు. స్కూళ్లు, ట్యూషన్లు, ఉరుకులు పరుగుల జీవితాన్నుంచి కూసింత విరామం అన్నమాట.

పిన్నలు, పెద్దలు... అందరిలోనూ సెలవుల మూడ్ వచ్చేస్తుంది. పెద్దలైతే ఎంచక్కా ఊరగాయలు పట్టుకోవచ్చు. వడియాలు పెట్టుకోవచ్చు. పిన్నలు పూలజడలు వేయించుకోవచ్చు. చేలు, చెట్లు, చెరువుల చుట్టూ చక్కర్లు కొట్టొచ్చు. వీరూ వారూ అని లేకుండా ఈతకాయలు, పుచ్చకాయలు, తర్బూజాలు, ఫలూదాలు, నన్నారీలు లాగించేయొచ్చు. తాటిముంజలు జుర్రేసేయొచ్చు.

పిల్లలంతా ఓ చోట చేరితే పెద్దలకు పరీక్షే. చిన్ని చిన్ని తగవులు తీర్చడం, వారికి తిండి పెట్టడం, ఎండకు పోకుండా కాపుగాయడం... మామూలు విషయమా! నీరసమొచ్చేస్తుంది పెద్దలకు!!

ఎండాకాలంలో చెప్పా పెట్టకుండా పలకరించేది కరెంటుకోత, నీళ్ల కొరత. చుట్టాల మోత. వీటన్నిటికీ సిద్ధంగా వుండక తప్పదు. కాకపోతే సమస్యలన్నీ సామాన్యులకే. డబ్బున్నోడికి ఆ బాధలు నిల్! పైసలుంటే చాలు. పవరు పోయినా పర్లేదు. జనరేటర్ వేసుకోవచ్చు. ఫ్యాన్లు, ఏసీలు ఆగకుండా తిప్పకోవచ్చు. అసలివన్నీ ఎందుకనుకుంటే ఊటీ, కొడైకెనాల్ చెక్కేయొచ్చు. అదీ బోరు కొట్టిందనుకుంటే విహారయాత్రలపేర విదేశాలు చెక్కేయొచ్చు.

పేదోడికే సమస్యలన్నీ. కరెంటుపోతే పైకప్పుకు వేళ్లాడే పాతకాలపు ఫ్యాను కూడా మొరాయిస్తుంది. నల్లాలో నీళ్లు రాను రానంటూ నీలుగుతాయి. మైళ్లకు మైళ్లు నడుచుకుంటూపోయి నీళ్లు తెచ్చుకోవాల్సిందే. కాలే కడుపు నింపుకోడానికి మండే ఎండలో పని చేయాల్సిందే. వీరికి ఇదే పెద్ద పరీక్ష.

ఇక వయోవృద్ధుల బాధ అంతా ఇంతా కాదు. ఎండాకాలం వస్తుందనగానే నీరసపడిపోతారు. ఎండలు ముదిరేకొద్దీ తపనపడిపోతారు. నిమిషనిమిషానికీ నాలుక తడుపుకోవడమే పెద్ద సమస్య. వంటిమీది గుడ్డే బరువై ఉక్కపోతకు తట్టుకోలేక ప్రాణం అల్లాడిపోతుంది. వీరికిది పరీక్షా కాలం. కాదంటారా! ✶

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
ఏప్రిల్ ఫూల్	...	7
సీరియల్	...	8
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
క్రైమ్‌కథ	...	20
బాబోయ్ బా..బా..లు...		21
చూద్దామా	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఉరికొయ్య ముంగిట్లో
ఉజ్వల అధ్యయనం

చల్ల చల్లగా... ... 10
పచ్చపచ్చని పుచ్చకాయ

సినిమా ... 17
మా భూమికి ముప్పయ్యేళ్లు!



బాగా విశ్లేషించారు

మార్చి 14 ప్రజాశక్తి ఆదివారం అనుబంధం సంచికలో వెలువడిన కవర్‌పేజీ కథనం 'మారని కథ! తీరని కల!!' బావుంది. తెలుగు చిత్ర పరిశ్రమ మంచి కథలు దొరకక పాత చిత్రాల కథలనే ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి కొద్ది మార్పులతో కొత్త చిత్రాలుగా రూపొందిస్తోంది. ఇది చిత్ర పరిశ్రమ కథల వెలితికి, సంక్షోభానికి అద్దం పడుతున్నదని బాగా విశ్లేషించారు. 'పరీక్షల సమయంలో ఆహారం' శీర్షికలోని సూచనలు విద్యార్థులకు బాగా వుపయోగపడేలా ఉన్నాయి. చిన్న పిల్లలకు సంబంధించి 'బాలనేస్తాలు' చాలా బాగున్నాయి. కానీ పిల్లలను ఇంకా ఆకర్షించేలా వివిధ రంగులతో ప్రచురిస్తే చాలా బాగుంటుంది. 'అండమాన్ అందాలు... నికోబార్ చందాలు...' వ్యాసం చదివిన తర్వాత ప్రత్యక్షంగా అక్కడి ఆదిమానవుని నాగరికత, కఠిన నియమాలు, వారి జీవన విధానం, అక్కడి ప్రకృతి అందాల రక్షణకు నిలిచిందనేది చరిత్ర సత్యంగా ప్రస్ఫుటించింది. వెళ్లి చూడాలనే కాంక్ష కల్గింది. అన్ని శీర్షికలూ ఆకట్టుకున్నాయి. వికృతి నామ సంవత్సరంలో స్నేహ పాఠకులను ఇంకా అలరిస్తుందని... అన్ని పత్రికల్లోకెల్లా ఆదర్శ దిన పత్రికలా వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నాం.

పాకాల శ్రీనివాస్ రెడ్డి, పరకాల, వరంగల్.

చదివించిన కవితలు

నిన్నటి ఉగాది సంచికను దీర్చిదిద్దడంలో మీ ప్రత్యేక శ్రద్ధ కనిపించింది. ఉగాది కోసం మీరు రాసిన ఎడిటోరియల్ స్వీట్‌గా బావుంది. కవితలు చదివించాయి. పండుగ సందర్భంగా శేఖర్ కార్టూన్లు పేజీ మొత్తం ఇవ్వడం బాగుంది. బాగా నవ్వు తెప్పించాయి. కుప్రిన్ కథ, అండమాన్ అందాలు...నికోబార్ చందాలు... వ్యాసం, తెర, రెంటాల వ్యాసాలు బావున్నాయి. 'ఆర్.ఎస్. అనుభవాలు ఆలోచింపచేసేవిగా వున్నాయి. సంధ్య రాసిన 'పరీక్షల సమయంలో ఆహారం' విద్యార్థులకు ఉపయోగకరంగా వుంది. 'స్నేహ'ను ఇంత చక్కగా తీర్చి దిద్దినందుకు ధన్యవాదాలు.

పుప్పాల కృష్ణమూర్తి, నల్గొండ.

ఉపయుక్తమైన వ్యాసం

అట్టమీద కథ 'మారని కథ! తీరని కల!!' విశ్లేషణాత్మకంగా వుంది. తెలుగు సినిమాలో లోపిస్తున్న కథాబలం, మారుతున్న వ్యాపారాత్మక విలువలు, గ్రాఫిక్స్ ఉపయోగంపై రెంటాల జయదేవ వ్యాసం బాగుంది. కథ లేకుండా వేస్తేరు ప్రయోగాలు చేసినా ఫలితం లేదని పలు సినిమాలు నిరూపించాయి. పాత సినిమాలను మళ్లీ రూపొందించినా విజయం సాధించడానికి కారణం కథపై ప్రేక్షకులకున్న మమకారమే అని చెప్పక తప్పదు. ఇకనైనా దర్శక నిర్మాతలు తెలుగు సినిమా ప్రాభవాన్ని పెంచే దిశలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. కథ 'మంత్రగత్తె' ప్రజలలోని మూఢనమ్మకాలు, ఆ నేపథ్యంలో సాగే ఓ ప్రేమ చరితను మన ముందుంచింది. కథ అనువాదమైనా, సహజంగా మన పరిస్థితులకు దగ్గరగా ఉన్నట్లు అనిపించింది. కవితలు బాగున్నాయి. ముఖ్యంగా 'మొబైల్ మొక్కలం' పయనించే హరితపు సందేశాన్ని విన్పించింది. మహిళా బిల్లు ఆమోదం ప్రాతిపదికగా ఉగాది ముందే వచ్చిందంటూ రాసిన కవిత 'ముందే కూసింది' బాగుంది. 'మెతుకు చెప్పిన సత్యం' రైతన్న మనోభీష్టాన్ని బయటపెట్టింది. ఆస్కార్ పురస్కారాల్లో అమెరికా ప్రభావం గురించిన 'సినిమా కబుర్లు' విశ్లేషణ బాగుంది. 'వికాసం'లో 'పరీక్షల సమయంలో ఆహారం' విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన వ్యాసం. అండమాన్ నికోబార్ దీవుల రమణీయతను చదివినప్పుడు వాటిని ఎప్పుడు చూద్దామా అన్పించింది. 'చెక్క కీ బోర్డు' గమ్మత్తుగా వుంది. 'మనలో మాట' చెప్పినట్టు ఉగాది శోభను పెంచే ప్రతీ ప్రయత్నం హర్షణీయమైనదే. పిల్లల పరంగా 'బాలనేస్తాలు, హ్యాపీ బర్త్‌డే, కలం 'స్నేహం' శీర్షికలు ఆసక్తిదాయకంగా ఉన్నాయి. పత్రికకు, పాఠకులకు ఉగాది శుభాకాంక్షలు.

కాందూరి శేషాచార్యులు, భరత్ నగర్, హైదరాబాద్.

చక్కటి వివరణ

అట్టమీది కథగా జయదేవ్ గారి 'మారని కథ– తీరని కల' వాస్తవికంగానూ, విశ్లేషణాత్మకంగానూ ఉంది. 'వికాసం' పరీక్షలు రాసే వారందరికీ ఎంతో ప్రయోజనకరంగా వుంది. 'చెక్క కీబోర్డు' విశేషాలు బావున్నాయి. ఈ వారం 'బాల నేస్తాలు' ఫాలో అయితే పిల్లి బొమ్మ గీయడం ఈజీగా వచ్చేస్తుంది. 'చూద్దామా' అండమాన్ విశేషాలు చదివిన తర్వాత ఆ దీవుల ప్రజలు సైతం నాగరికతను పరిపుష్టం చేసుకుని పరిఢవిల్లితే, ఈ దీవులింకా నయనానందకరం అవుతాయనడం నిర్వివాదాంశం. కవితల్లో శాంతిశ్రీ 'ముందే కూసింది' కవిత ద్వారా నగ్న సత్యాలు ప్రస్ఫుటితమయ్యాయి. ఆస్కార్ బొమ్మ ఎలా తయారయ్యిందో కలర్ పేజీలోని సమాచారం ద్వారా చక్కగా వివరించారు. సూక్ష్మజీవుల్లో హానికరమైనవీ, హానికరం కానివీ వుంటాయని విజయ్ గారి రచన ద్వారా అవగాహన చేసుకున్నాం. 'మనలో మాట' ఉగాది ఊసులు, కొస మెరుపు చదివాక నిజమే కదా అనిపించింది.

నేమాన సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం.

చదవాల్సినవే

మంచి కమ్యూనిస్టు ఎలా వుండాలి అనే పుస్తక ప్రభావం చాలామంది మీద వుంది. అమ్మ, కమ్యూనిస్టు ప్రణాళిక, చారిత్రక భౌతిక వాదం, రాజకీయ అర్థశాస్త్రం, కామ్రేడ్ నండూరి ప్రసాదరావు రాసిన గతితార్కిక చారిత్రక భౌతిక వాదం అందరూ చదవవలసినవే. స్ఫూర్తి ద్వారా నాయకులను, కమ్యూనిస్టు సాహిత్యాన్ని పరిచయం చేస్తున్నందుకు ప్రజాశక్తికి అభినందనలు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

అద్దం పట్టింది

మార్చి 14 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ 'మారని కథ! తీరని కల!!' రెంటాల జయదేవ్ గారి వ్యాసం నేటి సినీ పరిశ్రమకు అద్దం

పట్టినట్లుగా వుంది. 1990 సంవత్సరానికి ముందు అనేక సినిమాలు ప్రేక్షకులలో తమ ముద్రను వేశాయి. ఆనాటి దర్శకులైన కె.వి.రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు, కె. విశ్వనాథ్, జంధ్యాల లాంటివారు అద్భుతమైన చిత్రాలను సృష్టించి ప్రేక్షకుల మదిని గెలుచుకున్నారు. రాఘవేంద్రరావు, దాసరిలు తమ చిత్రాలతో మంచి కథను, సాహిత్యాన్ని ప్రవేశపెట్టి ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించుకున్నారు. చిరంజీవి హీరోగా విడుదలైన 'జగదేక వీరుడు – అతిలోక సుందరి' సినిమా కాసుల వర్షం కురిపించింది. కానీ నేటి సినిమాల పరిస్థితి అధ్వాన్నంగా వుంది. పాత కథనే కాపీ కొట్టి చిత్రాలను నిర్మిస్తూ అశ్లీలాన్ని జోడిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చిత్ర పరిశ్రమ నూరేళ్లు నిలవాలంటే మంచి కథా చిత్రాలు రావాలి.

కామిడి సతీష్ రెడ్డి, మారం దేవేందర్ రెడ్డి, పరకాల, వరంగల్.

అండమాన్ అందాలు... అదుర్స్

పాలకులు స్వార్థపూరిత వ్యక్తులు. దేశ చైతన్యానికి సామాన్య ప్రజలే కదలాలి. నిమ్మాకు కారంపొడి ఏంటండీ? ములక్కాడ బంగాళదుంప కూర మంచి వంట. పరీక్షల సమయంలో ఆహారం, సూచనలు బాగున్నాయి. అండమాన్ నికోబార్ అందాలు... అదుర్స్. పాటలు పాడే ఇసుక దిబ్బలు ఎప్పుడు సంగీతం నేర్చాయి? అదే వింత అనుకుంటే ఎగిరే బల్లి ఎన్నో విషయాలు చెప్పింది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.



టమాటా షర్బత్

కావలసిన పదార్థాలు

టమాటా రసం - 1 గ్లాసు

చెక్కర - 1 గ్లాసు

తయారు చేసే విధానం

టమాటాలు పుల్లటివి అయితే ఒక గ్లాసు పండ్ల రసానికి రెండు గ్లాసుల పంచదార పోయవచ్చు. తియ్యటివి అయితే ఒక గ్లాసు పంచదార సరిపోతుంది. టమాటా పండ్లు శుభ్రంగా కడిగి పొడిబట్టతో తుడిచి, మధ్యకు కోయాలి. వాటిని ఒక గిన్నెలో వేసి పిసికి రసం తీసి వడకట్టాలి. ఆ రసం కొలుచుకొని ఒక గ్లాసు రసానికి ఒక గ్లాసు పంచదార తీసుకుని పంచదారని వేరొక గిన్నెలో వేయాలి. దానిలో కొద్దిగా నీళ్ల పోసి స్టౌమీద పెట్టుకుని తీగ పాకం పట్టుకోవాలి. అలా వచ్చిన తీగ పాకంలో టమాటా రసం పోసి కలిపి దించుకోవాలి. ఇది చల్లగా అయిన తర్వాత తడిలేని సీసాలో పోసుకుంటే చాలా రోజులు నిల్వ వుంటుంది. టమాటా షర్బత్ తాగాలనుకున్నప్పుడు ఒక గ్లాసు నీళ్లలో 2 స్పూన్ల పాకం వేసుకుని కలుపుకుంటే చాలు.

కేసరి ఖీర్



కావలసిన పదార్థాలు

పాలు - 1 లీటర్

బియ్యం పిండి - 60 గ్రాములు

నెయ్యి - 2 స్పూన్లు

పంచదార - 125 గ్రాములు

పాల మీగడ - అరకప్పు

బాదం పప్పులు, పిస్తా పప్పులు - కొద్దిగా

వేడి పాలు - 1 స్పూన్

కేసరి - 1 స్పూన్

తయారు చేసే విధానం

కొద్దిసేపు బాదం పప్పులు నీళ్లలో నానబెట్టి పొట్టు తీసి ముక్కలుగా తరగాలి. కేసరి గుళికలు తీసుకుని వేడిపాలలో నానబెట్టాలి. బాండీలో నూనె వేసి కలిపిన బియ్యం పిండిని ఎర్రగా వేయించాలి. అందులో పాలు పోస్తూ వుండలు కట్టకుండా కలియబెడుతుండాలి. తర్వాత పంచదార వేసి గట్టి పాకం వచ్చేంతవరకు వుంచి దించాలి. ఒక పళ్లానికి నెయ్యిరాసి పాకాన్ని పోసి చల్లారనివ్వాలి. పాల మీగడ, బాదం పప్పు, పిస్తా పప్పు వేసుకోవాలి. ఫ్రిజ్ వుంటే కొద్దిసేపు దానిలో పెట్టుకుంటే ఇంకా బావుంటుంది.

స్వీట్ లస్సీ

కావలసిన పదార్థాలు

పెరుగు - 1 కప్పు

నీళ్లు - 3 కప్పులు

జాజికాయ - కొంచెం

పంచదార - 2 స్పూన్లు

రోజ్ వాటర్ - అర స్పూను

తయారు చేసే విధానం

పంచదార, నీళ్లు, పెరుగును కలిపి బాగా చిలకాలి. బాగా నురగ వచ్చేట్టు ఒక గిన్నెలో నుండి వేరే గిన్నెలోకి పోసి కలపాలి. దాన్లో రోజ్‌వాటర్, జాజికాయ కూడా వేసి కలపాలి. గ్లాసులో పోసి ఐస్‌ముక్కలు వేసుకుని తాగితే బాగుంటుంది. వేసవిలో వడదెబ్బ తగలకుండా వుంటుంది.

జింజర్ షర్బత్

కావలసిన పదార్థాలు

అల్లం - ముప్పావు కేజీ

నిమ్మకాయలు - 20

పంచదార - కేజీ

ఉప్పు - 1 స్పూన్

తయారుచేసే విధానం

అల్లం కడిగి మెత్తగా తొక్కాలి. మధ్యలో నీళ్లు చల్లుకుంటూ నూరి రసం తీయాలి. నిమ్మకాయల్ని కూడా పిప్పి, గింజలు రాకుండా రసం పిండుకోవాలి. నిమ్మరసంలో ఉప్పు వేసి కలపాలి. ఒక గిన్నెలో పంచదార, అల్లం రసం పోసి స్టౌమీద సన్నని సెగపై లేత పాకం పట్టుకోవాలి. పాకం వచ్చిన తర్వాత దింపి అందులో నిమ్మరసం పోసి బాగా చల్లారనివ్వాలి. తర్వాత పొడిగా వున్న సీసాలో పోయాలి. జింజర్ షర్బత్ తాగాలన్నప్పుడు ఒక గ్లాసు నీళ్లలో 2 స్పూన్లు రసం పోసి సర్వ్ చేయాలి. ఐస్ ముక్కలు వేసుకుంటే బాగుంటుంది. తడి తగలకపోతే ఈ రసం చాలా రోజులు నిల్వ వుంటుంది.



సర్కస్ ఫ్రీజ్

కావలసిన పదార్థాలు

బత్తాయి రసం - పావుకప్పు

ఆపిల్ రసం - పావుకప్పు

నారింజరసం - పావుకప్పు

టమాట రసం - పావుకప్పు

బాదం పప్పు - 3

యాలకుల పొడి - చిటికెడు

కుంకుమ పవ్వు - కొద్దిగా (వుంటే)

తయారుచేసే విధానం

బాదంపప్పు నీళ్లలో నానబెట్టి పొట్టుతీసి సన్నగా ముక్కలు తరగాలి.

టమాటాలు కోసి గుడ్డలో వేసి పిండితే రసం వస్తుంది. ఆపిల్ కూడా కొబ్బరిలా కోరి పిండితే రసం వస్తుంది. నారింజ, బత్తాయి రసం కూడా తీసుకోవాలి. ఈ నాలుగు రసాలు పిప్పి రాకుండా చేసి విడివిడిగా వుంచాలి. ఒక గ్లాసులో ఐస్ ముక్కలు వేసి ముందుగా ఆపిల్ రసం, తర్వాత టమాటా రసం, బత్తాయి రసం, నారింజ రసం వరుసగా నెమ్మదిగా కలపకుండా పోయాలి. బాదం పప్పులు, యాలకుల పొడి, కుంకుమ పువ్వు వేసి సర్వ్ చేయాలి.



స్ఫూర్తి

భగత్ సింగ్

ఉరికొయ్య ముంగిట్లో ఉజ్వల అధ్యయనం

ప్రసిద్ధ విప్లవకారుడు, భారతదేశ జాతీయ వీరుడైన భగత్ సింగ్‌ను బ్రిటీషు వలసపాలకులు 1931లో ఉరితీశారు. ఆయన జీవితం చాలా ధీరోదాత్తమైంది. భారత దేశంలోనే గాక సోవియట్ యూనియన్‌లో కూడా ఆయన గురించి పుస్తకాలు వెలువడ్డాయి. 'లెనినూ భారత దేశం' అన్న నా పుస్తకంలో భగత్ సింగ్ చదివిన గ్రంథాలను గురించి ఒక అధ్యాయమే రాశాను.

ఇప్పుడు పదేళ్ల తర్వాత నాకు మరిన్ని పత్రాలు లభించాయి. వాటిని భగత్ సింగ్ సోదరుడైన కులదీప్ సింగ్ దయతో నాకు చూపించారు. ఆ కుటుంబం యావత్తూ భగత్ సింగ్‌కు సంబంధించిన ప్రతి కాగితాన్నీ ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటుంది. ఆ పత్రాలు భగత్‌సింగ్ టెర్రరిజం నుంచి మార్క్సిస్టుగా పరిణామం చెందిన క్రమాన్ని తెలియజేసేవిగా ఉన్నాయి. తన సహచరులపై ఆయన ప్రభావాన్ని, వారి సైద్ధాంతిక అభివృద్ధిలో ఆయన పాత్రను కూడా అవి వెల్లడిస్తున్నాయి. భగత్ సింగ్ జైలు నోట్సు, చదివిన పుస్తకాల నుంచి రాసిపెట్టుకున్న భాగాలు అందులో ఉన్నాయి.

ఈ జైలు నోట్సు యువ విప్లవకారుడి సుసంపన్నమైన ఆంతరంగిక ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. స్వీయాభివృద్ధి కోసం అతను ఎంత కఠోర శ్రమ చేశాడో, ఎంత లోతుగా అధ్యయనం సాగించాడో తెలుస్తుంది. కారాగారపు గోడల మధ్య ఆయన విజ్ఞాన సముపార్జన కోసం ఎంతగా తపించిందీ అర్థమవుతుంది. ఆ కాగితాలనే ఊరికే పైపైనే చూసినా వాటిని రాసుకున్న వ్యక్తి శక్తివంతుడైన మేధా సంపన్నుడని స్పష్టమవుతుంది.

చిన్న చిన్న అక్షరాలలో ఉన్న ఈ విప్లవ లేఖనాలు ఆయన మనోభావాలను విశదపరుస్తాయి. బైరన్, విట్‌మన్, వర్డ్స్‌వర్త్‌ల కవితల నుంచి చరణాలు తీసుకోవడం ద్వారా ఆయన స్వాతంత్ర్యం విలువను అక్షరీకరించాడు. ఇబ్సెన్ నాటకాలతో పాటు డోస్టావస్కీ 'నేరము-శిక్ష' ఫ్రెంచి రచయిత విక్టర్ హ్యూగో లే మిజరబులే (బీదల పాట్లు)కూడా చదివాడు. రష్యన్ విప్లవ కారుడైన వీరీ ఫింగర్ డైరీల నుంచి మరో రష్యన్ విప్లవ పండితుడైన ఎన్‌మార్జోవ్ రచనల నుంచి ఓపిగ్గా ఎత్తి రాసుకున్నాడు. పర్షియన్ మహాకవి ఉమర్ ఖయ్యాం పద్యాల చరణాలున్నాయి. ఇవన్నీ చూస్తే వలస కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తూనే జీవితం, మృత్యువు వంటి ప్రశ్నలను భగత్ సింగ్ ఎంతగా శోధించాడో అర్థమవుతుంది. కేసు విచారణలో సమర్థంగా వాదించేందుకోసం భగత్ సింగ్ న్యాయ శాస్త్రం కూడా చదివాడు.

భగత్ సింగ్ జైలు నోట్ బుక్ పొడవునా స్వేచ్ఛ, ఇతరుల కోసం త్యాగం చేయడం అన్నది ప్రధానాంశంగా ఉంటుంది. పేజీలో ప్రసిద్ధ అమెరికన్ రచయిత థామస్ జెఫర్సన్ మాటలను ఆయన ఇలా ఉటంకిస్తాడు: "స్వేచ్ఛా వృక్షాన్ని ఎప్పటికప్పుడు దేశ భక్తుల, నియంతల రక్తంతో నిత్యనూతనం చేస్తుండాలి. అదే దానికి సహజసిద్ధమైన ఎరువు'

వేర్వేరు రచయితల నుంచి, పుస్తకాల నుంచి ఆయన ఈ విషయాలు రాసిపెట్టుకున్నాడు. తత్వశాస్త్రం, చరిత్ర, ఆర్థికరంగం వగైరాలపై ఆయన చదివి రాసుకున్నవి చాలా ఆసక్తి కలిగిస్తాయి. జైలు నిబంధనల కారణంగా భగత్ సింగ్ వాటిని ఒక క్రమపద్ధతిలో రాసుకునే అవకాశం లభించలేదు. బయటినుంచి కావలసిన పుస్తకాలు తెప్పించుకోవడం కూడా ఆయనకు చాలా కష్టమై ఉంటుంది. ఆయన రాసిపెట్టుకున్నవి చూస్తే భారతదేశంలోని పరిస్థితులను గురించి రాసింది తక్కువగా కనిపించడం ఆశ్చర్యమనిపిస్తుంది. అంతకు ముందు జాతీయోద్యమ నాయకులకు భారతదేశమే ప్రపంచ వైరుధ్యాలన్నిటికీ కేంద్రంగా భావించేవారు. భగత్ సింగ్ ఆ పరిమితమైన జాతీయ దృష్టి కోణాన్ని అధిగమించగలిగాడు. మొత్తం ప్రపంచాభివృద్ధి పరిధిలోనే భారత దేశ సమస్యలు పరిష్కారం కాగలవని అర్థం చేసుకున్నాడు.

భగత్‌సింగ్ అమెరికా ఫ్రెంచి విప్లవాల పట్ల అలాగే 18వ శతాబ్దిలోని భావజాలం పట్ల భారత విప్లవ కారుల బాల్యాంక ఆసక్తిని ప్రస్తావించారు. మానవుడి తిరుగులేని హక్కుల గురించి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి ఫ్రెంచి తత్వశాస్త్రవేత్త రూసో, అమెరికా బ్రిటన్ సామాజిక రాజకీయ నాయకుడు విప్లవకారుడైన థామస్ పైనే, అమెరికా రాజనీతిజ్ఞులు థామస్ జెఫర్సన్, పాట్రిక్ హెన్రీల భావాలను వుల్లేఖించుకున్నాడు.

సామాజిక వైరుధ్యాలను చూపించే గణాంక వివరాలు అతన్ని బాగా ఆకర్షించాయి. వేర్వేరు రచయితల నుంచి ఆయన తీసుకునే కొటేషన్లు విచిత్రంగా ఉన్నా వాటిలో చాలా అర్థం ఉంటుంది. ఉదాహరణకు బ్రిటన్‌లో తొమ్మిదింట పది వంతుల జనాభా మొత్తం ఉత్పత్తిలో సగం స్వాహా చేస్తున్నదని, దేశ జనాభాలోని మూడింట రెండు వంతుల మంది కేవలం ఏడో వంతుతో సరిపెట్టుకుంటున్నదని ఆయన రాసుకున్నాడు. అమెరికా జనాభాలో కేవలం ఒక్కశాతం కంటే తక్కువగా ఉన్నవారు 67,000 లక్షల డాలర్లు పోగుపోసుకున్న సంగతి, 70 శాతంగా ఉన్న శ్రామిక జనాభా జాతీయోత్పత్తిలో కేవలం నాలుగు శాతం మాత్రమే పొందగలుగుతున్నదని రాసిపెట్టుకున్నాడు.

ఫ్రెంచి దేశస్థుడైన ఊహాజనిత సోషలిస్టు చార్లెస్ ఫోరియర్ రచనల నుంచి ఆయన ఇలా రాసుకున్నాడు: "అందరికీ వ్యతిరేకంగా ఒక్కడు. ప్రస్తుతమున్న సామాజిక వ్యవస్థ చాలా హాస్యాస్పదమైనది. దీంట్లో మొత్తంలోని కొన్ని భాగాలు మొత్తానికి వ్యతిరేకంగా పని చేస్తాయి. సమాజంలో ఒకో వర్గం తన స్వప్రయోజనం కోసం ఇతర వర్గాలకు దురదృష్టకర పరిస్థితులు రావాలని కోరుకోవడం చూస్తాం. ఒక విధంగా ప్రతి వ్యక్తిగత ప్రయోజనమూ ఉమ్మడి ప్రజా ప్రయోజనానికి వ్యతిరేకంగా పని చేస్తుంటుంది (ఉదాహరణకు ఒక డాక్టరు సమాజం రోగాలతో బాధపడాలని కోరుకోవడం తనకు లాభదాయకంగా ఉంటుందని

శ్రామిక వర్గానికి తిరుగులేని అధికారం ఉండవలసిన అవసరంపై ఎంగెల్సు లెనిన్‌ల రచనల నుంచి అనేక కొటేషన్లు రాసుకున్నాడు. అలాగే శ్రామిక వర్గానికి సర్వాధికారం ఉండడంపై అవాస్తవ విమర్శలకు జవాబులు కూడా సేకరించాడు. ఈ సందర్భంగా అతను పదే పదే రష్యా విప్లవానుభవాలను ప్రస్తావిస్తాడు. తన జైలు నోట్సు 36వ పేజీలో మొదటిసారి రష్యా గురించి ప్రస్తావన కనిపిస్తుంది. ఆ తర్వాత వరుసగా రష్యా గురించి వివిధ రచయితలను, రచనలను మార్జిన్‌లో రాసుకున్నాడు.

కోరుకోవడం, లాయరు మరిన్ని వాజ్యాలు పెరగాలని, భవన నిర్మాతలు, అగ్ని ప్రమాదాలు సంభవించాలని కోరుకోవడం వంటివి).

వీటన్నిటినీ బట్టి చూసినప్పుడు భగత్‌సింగ్ పెట్టుబడిదారీ విధానాన్ని బేషరతుగా తోసిపుచ్చాడని విదితమవుతుంది. అందుకే ఇలా నిర్ధారించుకున్నాడు "ప్రస్తుత నాగరికతను ఏ విధంగా మార్చాలన్నది కాదు సమస్య. ఏ దిశలో మార్చాలన్నదే ప్రశ్న". భగత్ సింగ్ సామాజిక వ్యవస్థనూ, రాజ్య వ్యవస్థనూ కూడా విమర్శించాడు. ఆయన నోట్సులోని 46వ పేజీలో లెనిన్ రచనల నుంచి రాసుకున్న మొదటి కొటేషన్ కన్పిస్తుంది. మార్క్సు నుంచి లెనిన్ వరకూ అన్న పేరుతో అమెరికన్ రచయిత మారిస్ హిల్కాట్ రాసిన పుస్తకం నుంచి పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య స్వభావాన్ని తెలిపే ఈ భాగం రాసుకున్నాడు. 'పెట్టుబడిదారీ విధానంలో ప్రజాస్వామ్యం అనేది సార్వత్రికమైన అస్పష్ట ప్రజాస్వామ్యం ఏమీ కాదు. అది స్పష్టంగా పెట్టుబడిదారీ స్వభావం కలిగి ఉంటుంది. లేదా లెనిన్ పేరు పెట్టినట్టు దాన్ని పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం అని పిలవొచ్చు. ప్రజాస్వామ్యం అంటే సాంకేతికంగా రాజకీయ శాసనపరమైన సమానత్వం కలిగి ఉండడం. కానీ నిర్దిష్టంగా ఆచరణలో చూస్తే అది బూటకమైంది. ఆర్థిక శక్తిలో దారుణమైన వ్యత్యాసాలున్నంత వరకూ రాజకీయాలలోనూ, చట్టం ముందు కూడా సమానత్వం అనేది ఉండదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో మొత్తం ప్రజాస్వామ్య యంత్రాంగం అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న శ్రామిక వర్గం ఓట్లతో పాలక వర్గానికి చెందిన స్వల్ప సంఖ్యాకులను అధికారంలో ఉంచేందుకే పనికివస్తుంది'.

మతం ఎలా ఆవిర్భవించిందో తెలుసుకోవడానికి భగత్ సింగ్ మార్క్సును అధ్యయనం చేశాడు. హెగెల్ న్యాయ తాత్విక సిద్ధాంత పరామర్శ అన్న పుస్తకంలో మార్క్సు మాటలు జైలు నోట్సు 40వ పేజీలో కనిపిస్తాయి. "మనిషి మతాన్ని సృష్టించాడు. మతం మనిషిని సృష్టించలేదు. మనిషి, రాజ్యం, సమాజం అన్నీ కలిస్తే మనిషి మనిషవుతాడు. ఈ రాజ్యం ఈ సమాజం మతాన్ని సృష్టిస్తాయి. అది ప్రపంచం గురించి సమీకృత చైతన్యం. ఎందుకంటే ఆ ప్రపంచం చుట్టూ సరిహద్దులుంటాయి. మతం అనేది ప్రపంచాన్ని గురించి సాధారణ సిద్ధాంతం, దాన్ని సర్వస్వమనదగిన సంకలనం, జన రంజక భాషలో చెప్పిన తర్కం... కనక మతంపై పోరాటం అంటే పరోక్షంగా ఆ ఆధ్యాత్మిక ముసుగుకు జన్మనిచ్చిన ప్రపంచంపై పోరాటమే...అది ప్రజలకు మత్తుమందు" 192వ పేజీలో భగత్ సింగ్ చివరి వాక్యాన్ని మరోసారి రాసుకోవడం గమనించదగింది.

కనక ఈ నోట్సును గమనిస్తే భగత్ సింగ్ పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించాలని గట్టిగా కోరుకున్నట్టు స్పష్టమవుతున్నది. మార్క్సిజం, లెనినిజం వ్యవస్థాపకుల వలెనే అతను కూడా శాస్త్రీయ సోషలిజమే రావాలని గట్టిగా కోరుకున్నాడు.

కమ్యూనిస్టు ప్రణాళిక నుంచి కింది భాగం తీసుకున్నాడు.

పార్టీ నాయకత్వం వహించకపోతే శ్రామిక వర్గ విప్లవం సాధ్యం కాదన్న విషయాన్ని కూడా అతను తెలుసుకోగలిగాడు. అందుకే అంతర్జాతీయ శ్రామిక గీతమైన 'ఆకలి మంటల మలమలమాడే అనాథలందరూ లేవండోయ్' అన్న పాటను (ఇంగ్లీషులో) జాగ్రత్తగా రాసిపెట్టుకున్నాడు.

క్రమక్రమంగా భగత్‌సింగ్ 'విప్లవానికి ఆరంభంగా సాయుధ తిరుగుబాటు' అన్న అంశానికి వచ్చాడు. అలాంటి విప్లవం తీసుకురావాలని భారత విప్లవకారులెప్పుడూ కోరుకుంటున్నప్పటికీ ఆ పనిచేయడంలో సఫలీకృతులు కాలేకపోయారు. ఈ కారణంగానే భగత్‌సింగ్‌కు మార్క్సు రచనల పట్ల ప్రత్యేకాసక్తి ఏర్పడింది.

జర్మనీలో విప్లవం ప్రతీఘాత విప్లవం అన్న ఫ్రెడరిక్ ఎంగెల్సు రచనను అతను జాగ్రత్తగా కాపీ చేసుకున్నాడు. అయితే మరొకరు రాసిన పుస్తకంలోంచి కొటేషన్లు తీసుకోవడం వల్ల ఇది మార్క్సు రాసిందనే పొరబాటు భావనకు గురయ్యాడు. అందులో ఇలా ఉంటుంది "మొదటి విషయం – నీ చర్య పర్యవసానాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటే తప్ప నీవు ఎప్పుడూ తిరుగుబాటుతో ఆడుకోవద్దు. తిరుగుబాటు అనేది ఒక కొలమానం వంటిది. దాని పరిధి అపరిమితమైంది. దాని విలువ రోజురోజుకు మారిపోవచ్చు. నిన్ను వ్యతిరేకించే శక్తులకు యంత్రాంగం ఉంటుంది. క్రమశిక్షణ, అలవాటైన అధికార వ్యవస్థ ఉంటాయి. వారికి వ్యతిరేకంగా నీవు బలమైన ప్రతిఘటనను తీసుకురాలేకపోతే నీవు ఓటమి పాలై నాశనం అవుతావు. రెండవది– తిరుగుబాటు మార్గం అనేదాంట్లో ఒకసారి ప్రవేశించిన తర్వాత కృతనిశ్చయంతో పోరాడాలి. ఎప్పుడూ ఎదురుదాడికి సిద్ధంగా ఉండాలి. ఆత్మరక్షణలో పడిపోవడమంటే ఏ సాయుధ తిరుగుబాటుకైనా అది ఆత్మహత్యతో సమానమే. అలాటి పరిస్థితులలో శత్రువులను గురించి ఆలోచించేలోగానే పరాజయం ప్రాప్తిస్తుంది".

భగత్‌సింగ్ రాసిపెట్టుకున్న ఈ భాగంలో ప్రతి పదమూ సాయుధ తిరుగుబాటు గురించి పైపై ఆలోచనలు చేసే వారికి హెచ్చరిక వంటిది. మొదట్లో తనకూ అలాటి ఆలోచనలు కొన్ని ఉండేవి కనకనే వాటి ప్రమాదకర స్వభావాన్ని అతను బాగా తెలుసుకోగలిగాడు.

భారతీయ విప్లవకారులు చాలా కాలం పాటు స్వతంత్ర సాధన తర్వాత పరిస్థితిని గురించి ఆలోచించలేదు. అలాగే ఆ ప్రభుత్వ సామాజిక ఆర్థిక విధానాలు ఎలా ఉండాలో ఊహించలేదు. స్వాతంత్ర్యం వస్తే చాలు అన్నీ జరిగిపోతాయనుకున్నారు. భగత్ సింగ్ మార్క్సిజం చదివిన ఫలితంగానే ఇలాటి ప్రశ్నలకు సమాధానాలు వెతకడం మొదలెట్టారు. శ్రామిక వర్గానికి తిరుగులేని అధికారం ఉండవలసిన అవసరంపై ఎంగెల్సు లెనిన్‌ల రచనల నుంచి అనేక కొటేషన్లు రాసుకున్నాడు. అలాగే శ్రామిక వర్గానికి సర్వాధికారం ఉండడంపై అవాస్తవ విమర్శలకు జవాబులు కూడా సేకరించాడు. ఈ సందర్భంగా అతను పదే పదే రష్యా విప్లవానుభవాలను ప్రస్తావిస్తాడు. తన జైలు నోట్సు 36వ పేజీలో మొదటిసారి రష్యా గురించి ప్రస్తావన కనిపిస్తుంది. ఆ తర్వాత వరుసగా రష్యా గురించి వివిధ రచయితలను, రచనలను మార్జిన్‌లో రాసుకున్నాడు. "బోల్షివిజం స్వరూప స్వభావాలు అన్న రేనో ఫులాప్ మిల్లర్ రచన, మాకీ ఓ హేరే రాసిన 'రష్యా', లాన్సెల్ట్ రాసిన 'రష్యన్ విప్లవం', బోల్షివిక్ విప్లవం, మార్క్సు లెనిన్ విప్లవ శాస్త్రం అన్న అంటన్ కారల్ గ్రీన్ రచన, వగైరాలన్నిటి పేర్లు మనకు కనిపిస్తాయి. ఇదే గాక అతను ప్రపంచాన్ని కుదిపేసిన 'ఆ పదిరోజులు' అన్న జాన్ రీడ్ ప్రసిద్ధ రచన, గోర్కీ 'అమ్మ' వగైరా పుస్తకాలు కూడా చదివాడు.

(భారతదేశంపై సోషలిజం ప్రభావం గురించి సోవియట్ యూనియన్ ప్రచురించిన పుస్తకంలోని ఎల్.వి.మిత్రోకిన్ వ్యాసం నుంచి)

భగత్ సింగ్ జైలు నోట్ బుక్ పొడవునా స్వేచ్ఛ, ఇతరుల కోసం త్యాగం చేయడం అన్నది ప్రధానాంశంగా ఉంటుంది. పేజీలో ప్రసిద్ధ అమెరికన్ రచయిత థామస్ జెఫర్సన్ మాటలను ఆయన ఇలా ఉటంకిస్తాడు: "స్వేచ్ఛా వృక్షాన్ని ఎప్పటికప్పుడు దేశ భక్తుల, నియంతల రక్తంతో నిత్యనూతనం చేస్తుండాలి. అదే దానికి సహజసిద్ధమైన ఎరువు' వేర్వేరు రచయితల నుంచి, పుస్తకాల నుంచి ఆయన ఈ విషయాలు రాసిపెట్టుకున్నాడు. తత్వశాస్త్రం, చరిత్ర, ఆర్థికరంగం వగైరాలపై ఆయన చదివి రాసుకున్నవి చాలా ఆసక్తి కలిగిస్తాయి.



సర్పజాతి

మానవులంతా సర్పాలమే!
బుసకొట్టలేని పాములం!
మాటేసి కాటేయగల నేర్పులం!
పరస్పర వాదులాటలలో
ఆదమరిచి వుండగా
కాలకూట విషాన్ని చిమ్మగల
తెలివైన త్రాచులం!
ఖలునకు నిలువెల్ల విషమే అని
శతకారుడేనాడో శెలవిచ్చాడు!
ఎదఎదలో పొదవుంది
ఆ పొదలో పాముదాగి వుంది!
మన దేహమే పాముల పుట్ట!
పాముకాటుకి విరుగుడుంది
మానవ కాటుకి వేటుకి
మందనేదే లేదు!
మన కోరలు పీకుట ఎవరితరం?
మనిషి గరళాన్ని కక్కగలడు!
మానవులవి విలన్...
చూపులే కాదు విషపు చూపులు!
నాదస్వరాన్ని మనకు
మనమే ఊదుకుంటాం
పడగ విప్పని నాగులం మనం!
కన్నవారిని కట్టుకున్న వారిని...
సహజీవనం నటిస్తూ...
పర్యావరణం పైనా కాటేస్తాం!
భావితరాల వారికేమీ మిగల్చక
పంచభూతాలను సైతం
కొండచిలువల్లా... రాహువుల్లా...
కొంచెం కొంచెం మింగుతూ...
వినాశనానికి సృష్టికర్తలం!
గరళం ఔషధ యుక్తం!
మానవ విషం నిరుపయోగం!
విధ్వంసాలకు మూలం!
శ్రీమహావిష్ణువు శేషశాయిపై
కదా పవళించేది!!
కాళియమర్దనం చేసిన
శ్రీకృష్ణుడు మానవుడే కదా!?
ఆ సంతతివారమే మనం...
దైవాంశ సంభూతులం!
అందుకే మానవకాటు బహుచేటు!!

- ఎస్. వివేకానంద

మొక్క



మొక్కను నాటాను
రోజూ నీరు పెట్టాను
తనువంతా కడిగాను
ఆకుపచ్చని అందం
రెట్టింపయ్యింది...
కనులకు అంతటి సౌందర్యం
మరేదీ కన్పించలేదు
మొక్క చిగుళ్లను చూడగానే
జీవితపు ఆశలు మరింతగా
వికసించాయి..
రాలిపడ్తున్న ఆకులు
జీవన సత్యాన్ని బోధిస్తున్నాయి..
వేరే ప్రదేశానికి వెళ్లాను..
మనసు మాత్రం మొక్కపైనే
ఉంది.

- కాండూరి శేషాచార్యులు

బ్రతుకుదెరువు



ఎవరికీ ఏమీ కాని
ఏకాంతవాస సామ్రాజ్యానికి
అధినేత్రిని
అంగాల్ని వీధిలోకి విసరందే
ఆకలిని సముదాయించలేని నిశీధి గాయాన్ని.
బుసకొట్టే నీ కోరికల కాష్టంలో
రగిలిపోతున్న ఒక్కోక్షణం
నాకు జీవన్మరణ "రణం"
నీ వికృత చేష్టల నడుమ
ఒరుసుకుపోయే శరీరంతో
చస్తూ...! బ్రతుకుతూ...!!
బ్రతకడం కోసం చస్తూ...!!
స్పర్శాజ్ఞానం కోల్పోయిన దేహంతో
ఆనందించే నువ్వు!
ఆకలి విస్ఫోటనంలో
తెగిపడిన పోగులను ఏకం చేసే ప్రయత్నంలో నేను!!

ఆంక్షల హరివిల్లు

విభిన్న ధృవాల సహజీవనం
నిరంతర ఆకర్షణా వికర్షణల భ్రమణం
దగ్గరవుతున్నట్టనిపిస్తూనే
భర్తీ చేయలేని దూరపులోయలు
మన ఆలోచనల సాలెగూళ్లెప్పుడూ
తూర్పు పడమరలే!!
నీతో సమానంగా నడవాలనే తపన నాది!
నీ అడుగులను అనుసరించాలనే
శాసనం నీది!!
హెచ్చుతగ్గుల కొలబద్దపై
తగ్గుదలే నాకందించే నజరానా
ఆశల రహదారిలో
బాసటగా నిలుస్తావనే నా కాంక్ష
నీ ఆంక్షల తూటాలతో విచ్ఛిన్నమైంది
బంధాలన్నీ బంధనాలైతే
మనిషి మనిషిగా మిగలడం గగన సుమం!!

- కడెం లక్ష్మీ ప్రశాంతి

ఏప్రిల్ ఫూల్ - శేఖర్

మీ నాన్న నిన్న ఏప్రిల్ ఫూల్ చేశాడా?
ఇందులో కొత్తేముంది... రోజూ మీ నాన్న ప్రజల్ని చేసేది అదేగా...!!!
నేనడిగినంత లంచం సొమ్ము ఇస్తానని వాడు ఒప్పుకున్నప్పుడే నాకు అనుమానం వచ్చింది...!!
ఏప్రిల్ ఫూల్
తపస్సు ప్రారంభించిన ఒక్క సెకన్లోనే ప్రత్యక్షం అయ్యారు... ఏప్రిల్ ఫూల్ కాదుగదా...
పెళ్ళిచూపుల వరకు ఓ.కే... కట్నం విషయం మాత్రం రేపు మాట్లాడుకుందాం బావగారు!!
ఏప్రిల్ 1
ఇంతకాలం తర్వాత ఐలవ్యూ... 'ఈ రోజు' చెప్పటంలో నీవుద్దేశ్యం?!!
కరాటేలో బ్లాక్ బెల్ట్ వుందంటే.... ఏప్రిల్ ఫూల్... చేస్తుందనుకున్న దెబ్బడ్డా.......

సీరియల్

వియత్నాం గెరిల్లా

10వ భాగం

జరిగినకథ:

ట్రువాంగ్, జంగ్‌లను సురక్షిత ప్రాంతంలో దిగబెట్టడానికి బండిలో బయలుదేరుతుంది హావ్. మధ్యలో సైనిక శిబిరం దగ్గర ఏం మాట్లాడొద్దని, అంతా తానే చూసుకుంటానని బండి తోలే హాయ్ వారికి చెప్తాడు. అనుకున్న విధంగానే సావో ట్రీ శిబిరం దగ్గర సైనికులు వీరిని చూచారు. హాయ్‌ని గుర్తించి బండిలో వున్న వారి వివరాలు అడిగారు. తర్వాత తినడానికి ఏమైనా వున్నాయేమోనని వాకబు చేశారు. ఎండు రొయ్యలు వున్నాయని తెలిసి సంతోషంగా పావలా రొయ్యలు వెయ్యమని బుట్టను కిందకు వేశారు. అయితే అందులో పావలా లేదు. అయినా సరే హాయ్ తమ దగ్గరున్న ఎండు రొయ్యల్ని బుట్టలో వేసి ...బండిని ముందుకు నడిపిస్తాడు...ఆ తర్వాత....

మూలం: **బుయ్‌డక్ ఆయ్**

తెలుగు: **కొల్లి సత్యనారాయణ**

రాత్రి ఎనిమిది గంటలయ్యే సరికి 'హీప్‌మీ' చేరుకున్నాం.

మమ్మల్ని చూడగానే 'హాయ్' భార్య చాలా సంతోషించింది. పుట్టినప్పుడు ఆ బిడ్డ బలహీనంగా వున్నా యిప్పుడు ఆరోగ్యంగా వుంది.

'ట్రువాంగ్', 'జంగ్' లకు వసతి ఏర్పాటు చేసి, ఆ రాత్రి అక్కడే వుండి పోయాను. తెల్లవారక ముందే లేచి, ప్రయాణానికి సిద్ధమయ్యాను. అప్పటికే 'హాయ్' భార్య టిఫిన్ తయారు చేసింది.

టిఫిన్ తిన్న తరువాత....

"ఆ ఇద్దరినీ నీకు అప్పగించాను. జాగ్రత్త. కొద్ది రోజుల వరకు బయటికి పోనీయకు. రహస్య గదిలో వుంచు. ఈ విషయం నీ భార్యకు కూడా చెప్పు" అని 'హాయ్' కి సలహా ఇచ్చాను.

"ఇది వరకే చెప్పాను"

"ఇప్పుడు ఇంటికి పోతున్నా. ఏదన్నా జరిగితే వెంటనే కబురు పంపు". శాలువా కప్పుకుని బయలుదేరబోతుండగా 'హావ్ వెళ్తున్నావా?' అని అడిగాడు 'జంగ్'.

"ఆ! వెళ్తున్నా. ఆరోగ్యంగా జాగ్రత్తగా వుండండి"

"ఆరోగ్యంగా వుంటాం. సంవత్సరాది పండక్కి వచ్చి, అక్కడే పండగ చేసుకుంటామని 'బౌ' తాతయ్యతో చెప్పు. అప్పటికి పాప కూడా పెద్దదవుతుంది. ఇంక వెల్తురొస్తుంది. వెళ్లు"

'జంగ్'కు గుడ్‌బై చెప్పి బయలుదేరాను. ఆ ఇద్దరు కామ్రేడ్స్ అంటే గౌరవం, ప్రేమ ఏర్పడ్డాయి. వాళ్ల పట్టుదల, నిజాయితీ గుర్తించాను. ఆ కొద్దిపాటి ప్రయాణం ఆ వీడ్కోలును చెలింప చేసింది.

ఒండు నెలల తరువాత నేను తిరిగి 'హీప్‌మీ' గ్రామం వచ్చాను. 'ఐరన్‌బ్రిడ్జి' దాటిన తరువాత వున్న మూడు గ్రామాలలో ఉద్యమ బాధ్యతను ఆ సమయంలో 'ట్రువాంగ్' చూస్తున్నాడు. 'ఐరన్‌బ్రిడ్జి'కి ముందున్న మూడు పల్లెలు 'జంగ్' బాధ్యత కింద వున్నాయి. 'జంగ్' దళంలో ప్రత్యేక విషయం మాట్లాడ్డానికి, అక్కడ స్థావరాలను తనిఖీ చేయడానికి నేను హీప్‌మీ వెళ్లాను. వాస్తవానికి ఆ ప్రాంతం కామ్రేడ్స్ అజమాయిషీలో వుంది. అక్కడ పరిస్థితిని పూర్తిగా అవగాహన చేసుకోవటమే నా పని. ఎందుకంటే స్థావరాల్లో చేసే ప్రతి చిన్న మార్పు వల్ల చాలా యిబ్బంది పడవలసి వస్తుంది.

నేను 'హాయ్' ఇంటికి వెళ్లే సరికి పొద్దు పోయింది. భారీ వర్షం వచ్చే సూచనలు ఉన్నాయి. అది వర్షాకాలం మధ్య భాగం. ఆ రాత్రంతా పెద్ద పెద్ద జల్లులు పడుతూనే వున్నాయి. గెరిల్లాల సమావేశం నుండి 'హాయ్' తిరిగి వచ్చాడు. 'జంగ్' నేల మాళిగలో వున్నాడనుకుని దాని మూతపై చప్పుడు చేయబోయాను.

'జంగ్' అక్కడ లేడని 'హాయ్' తల ఊపాడు.

"ఎక్కడ?" అని అడిగాను.

"మాతో పాటు సమావేశంలో పాల్గొన్నాడు. ఈ రోజుల్లో రాత్రిళ్లు ఇంట్లో వుండడు"

"ఎక్కడికన్నా వెళుతున్నాడా?"

"హాయ్" నాకు దగ్గరగా వచ్చి, అతను ఈ రాత్రి పొలంలో గడుపుతాడు. ఈ చివరిరోజుల్లో అతను ఇంటి దగ్గర నిద్రపోలేక పోతున్నాడు. నేలమాళిగలో కూడా నిద్రపోలేడు. వర్షం మూలంగా దాని గోడలు కూలిపోతున్నాయి. మంచంపై పడుకోవడం అసంభవం. ఐరన్ బ్రిడ్జి, లాంగ్‌వాంగ్‌ల వద్ద నున్న శత్రుమూక ఈ ప్రాంతంలో కాపలా కాస్తోంది. కూలీలను చేర్చుకోవాలన్న శత్రువుల ప్రయత్నాలను భగ్నంచేస్తూ జంగ్, ట్రువాంగ్‌లు ప్రజల్ని సమీకరించి వాళ్లు పంపిన వుత్తరువు కాగితాలను చించివేసి, సైనిక కార్యాలయం నిర్మాణానికి రమ్మన్న ఉత్తర్వును ఖాతరు చేయకుండా చేశారు. గ్రామాలు చుట్టుముట్టడానికి శత్రువు నాలుగు సార్లు ప్రయత్నించాడు. కొంతమంది తొత్తులను, ముసలివాళ్లను మాత్రం పట్టుకోగలిగారు. కూలీలను సమీకరించాలనే వాళ్ల ప్లాను భగ్నమైంది. ఆ ప్రాంతంలో కామ్రేడ్స్ వుండడం వల్లనే అలా జరిగిందని శత్రువుకు అనుమానం. గత కొద్ది రోజులుగా ఇళ్లను సోదా చేయడానికి వారు రాత్రిళ్లు ఇక్కడకు వస్తున్నారు" అని మెల్లగా చెప్పాడు.

"లేదు, చీకటి పడగానే జంగ్ పొలాలలోకి వెళ్లిపోతాడు. ఈ సీజన్‌లో దాదాపు ప్రతి రాత్రి వర్షం కురవడం వల్ల అతను నిద్రపోలేడు. ఇంట్లో పడుకుంటే నేను, నాభార్య వంతుల వారీగా కాపలా కాస్తామని చెబితే అందుకు అతను అంగీకరించలేదు".

మేము మాట్లాడుకుంటున్న సమయంలో పెద్ద వర్షం కురుస్తోంది. హాయ్ బయటికి వెళ్లి ఆకాశం వంక చూపిస్తూ "భారీ వర్షం పడుతోంది. ఎంత బాధపడుతున్నాడో" అన్నాడు.

"తల దాచుకోడానికి పొలంలో గుడిసైనా వుందా?"

"గుమ్మడి తోటలోని గుడిసెలో వుంచుదామనుకున్నాను. కానీ అది అంత

సురక్షితమైన ప్రాంతం కాదు. ఆ గుడిసెమీద కూడా శత్రువులు ఒక కన్నువేసి వుంచారు. గత రాత్రి 'ఎన్‌హన్' తోటలోకి వెళ్లారు" అని చెప్పాడు.

"సరే, తరువాత ఏదో ఒక మార్గం ఆలోచిద్దాం" అని చెప్పి జంగ్‌ను కలుసుకోవాలి. అర్జంట్" అన్నాను.

"ఇప్పుడు వద్దు. వర్షం పడుతోంది. ఇక్కడే వుండు, ఇక్కడికే అతణ్ణి రమ్మంటాను"

"కాదు కాదు. నన్నక్కడకు తీసుకెళ్లు. అతను ఇక్కడకి రావడం అంత క్షేమం కాదు"

'సరే"

శ్రీమతి హాయ్ ఇంట్లోకి వెళ్లి ఒక టోపీ తెచ్చి నా తలపై పెట్టింది. వెనుక ద్వారం గుండా నేను, హాయ్ బయటికి వెళ్లాం. పోకచెక్క తోటలు దాటిన తర్వాత రెల్లు దుబ్బులు వున్న చోటుకు వెళ్లాం. రెల్లు దుబ్బులలో దారి చేస్తూ హాయ్ ముందు నడుస్తూ వుంటే నేను అతణ్ణి అనుసరించాను. కుండపోతగా వర్షం కురుస్తోంది. అప్పుడప్పుడు వచ్చే మెరుపులతో ఆకాశం కాంతివంతం అవుతోంది. రెల్లు దుబ్బుల మధ్యలో అక్కడక్కడ పెద్ద మోడు చెట్లు వున్నాయి. చివరి చెట్టు దగ్గరకి వెళ్లిన తర్వాత హాయ్ కుడివైపుకు తిరిగాడు. నాలుగడుగులు వేసిన తర్వాత చిన్నగా ఒక రకమైన పిట్టకూత వేశాడు. దుబ్బుల్లో నుండి సమాధానం వచ్చింది. రెల్లుదుబ్బులు కదలసాగాయి. చీకట్లో తల కనిపించింది. జంగ్ నెమ్మదిగా "హాయ్ నీవేనా" అన్నాడు.

"ఆ! నేనే"

నన్ను పొదల్లోకి తీసుకెళ్తుండగా "అక్కడ వుంది జంగ్‌యేనా?" అని హాయ్‌ని అడిగా.

"హావ్! కదూ?" సంతోషంగా అన్నాడు జంగ్.

"ఆ! నేనే"

"ఇక్కడికెందుకొచ్చావ్?"

"ఒక ముఖ్యమైన విషయంలో నీ సలహా కోసం వచ్చా. జిల్లా కమిటీ నుండి నీకొక ఉత్తరం వచ్చింది"

జేబులో నుండి వుత్తరం తీసి జంగ్‌కిచ్చా. వుత్తరం ఇచ్చేటప్పుడు అతని చేయి తగిలింది. తడిసింది కాబోలు చల్లగా వుంది. జంగ్ పక్కనే కూర్చున్నాను. తన జేబులో నుండి బ్యాటరీ లైటు తీసి చెయ్యి అడ్డం పెట్టి వెలిగించాడు. తడిసి ముద్దయి వున్నాడు. అతను పడుకున్న స్థలం కూడా తడిగా వుంది. తడవకుండా వుండేందుకు దుబ్బులపై కట్టిన ప్లాస్టిక్ పట్టా గాలికి కొట్టుకుంటోంది. వర్షంజోరు ఎక్కువైంది. ఉత్తరం చదివిన తర్వాత బయటికి వచ్చి ప్లాస్టిక్ పట్టా మా యిద్దరికీ కప్పాడు. అది సరిపోలేదు. మేమూ తడిసిపోయాం. అయినా నాకు చలి అనిపించలేదు. వారం రోజుల నుండి ప్రతి రాత్రి జంగ్, ఇతర కామ్రేడ్స్ ఇలా వర్షంలో వుంటున్నారు.

"సరే. కొద్ది రోజులుగా పరిస్థితి మరింత కష్టంగా తయారయిందని జిల్లా కమిటీకి తెలియజెయ్యి. మా ఆచూకీ శత్రువులకు తెలిసినట్లుగా వుంది. అయినా ఫర్వాలేదు. మా స్థావరాలపై వాళ్లు దాడి చేయడం ప్రారంభించగానే మాకు అండగా ప్రజలు కూడా నిలబడ్డారు. దాదాపు అందరూ తమకిచ్చిన నోటీసు కాగితాలను చింపివేశారు. ఈ రోజు సాయంత్రం రెండు గెరిల్లా దళాలను ఏర్పాటు చేశాం. ఆయుధాలు, పేలుడు మందు తొమ్మిదో తారీఖున అందేటట్లు పంపమని మన కామ్రేడ్స్‌తో చెప్పు" వివరంగా చెప్పాడు జంగ్.

"బహిరంగంగా తేవాలా? లేక..."

"రహస్యంగా అయితే మంచిది. హీప్‌లో వద్దకు చేరిస్తే సరిపోతుంది. అక్కడ నుండి తేవడానికి కామ్రేడ్స్‌ను పంపుతా. తొమ్మిదో తేదీ అర్ధరాత్రికి. బాగా గుర్తుంచుకో"

"జంగ్ హాయ్‌వైపు తిరిగి, "ఇప్పుడు కార్యక్రమం ఆలోచిద్దాం. ఎల్లుండి ఇద్దరు కామ్రేడ్స్‌ను అక్కడికి పంపడానికి ఏర్పాటు చెయ్యి"

"నేనూ వెళ్లాలా?" అని అడిగాడు.

"లేదు"

"సరే, జాగ్రత్తగా ఇంటికి వెళ్లండి. వర్షం బాగా కురుస్తోంది. తల పైకెత్తి ఆకాశం వంక చూశాడు. గాలి, వర్షం సంగతి మర్చిపోయినట్లుగా వున్నాడు.

బయలుదేరడానికి మేమిద్దరం లేచి నిలబడగానే "చిట్టి థై ఎలా వుంది?" అని అడిగాడు జంగ్.

"బాగానే వుంది, కృతజ్ఞతలు"

మేమిద్దరం రెల్లు దుబ్బుల నుండి బయటికి వచ్చిన తర్వాత నా కళ్లు బైర్లు కమ్మినట్లుగా వుంది. లాంగ్‌హాంగ్ కేంద్రం నుండి విసనకర్ర ఆకారంలో వెలుతురు తళుక్కుమంది. వర్షంలో ఆ వెలుతురు మసకగాను, తెల్లగాను వుంది.

వేకువ జామునే ఇతర స్థావరాలు చూడటానికి వెళ్లాను. అక్కడ పరిస్థితి మెరుగ్గా వుంది. ఈ స్థావరాలు చుట్టుపక్క ప్రాంతాలకు విస్తరించాయి. వీటిలో రెండింటిపై శత్రువు దాడిచేసి ఒట్టి చేతులతో తిరిగిపోయాడు.

లువాంగ్‌తో కలిసి మరునాటి మధ్యాహ్నం తిరిగి వచ్చాను. హీప్‌మీ నుండి సావో బీచ్ వస్తుండగా,

"ఈ ప్రయాణం అయిన తర్వాత ప్రసవించే వరకు నువ్వు ఎక్కడికీ వెళ్లకూడదనుకుంటాను" అన్నాడు లువాంగ్.

"నేనూ అదే అనుకుంటున్నాను"

కాలం త్వరగా గడిచిపోయింది. నా భర్త వచ్చి వెళ్లిన తర్వాత ఎనిమిది నెలల్లోనూ, నా జీవిత మార్గాన్ని మార్చివేసే అనేక సంఘటనలు జరిగాయి. నేను ఏర్పాటు చేసిన స్థావరాలకు దళ సభ్యుల్ని తీసుకెళ్లడానికి ఆరుసార్లు ప్రయాణం చేయవలసి వచ్చింది. హీప్‌లో మాదిరిగానే హీప్‌మీలో మా స్థావరాలు బాగానే వున్నాయి. ఎక్కడా సమాచారం బయటికి పొక్కలేదు. దానితో నాలో విశ్వాసం పెరిగింది. స్నేహితులపై కూడా విశ్వాసం పెరిగింది. డువాంగ్ నాకు ఈ బాధ్యత అప్పగించినప్పుడు, కష్టంతో కూడినదిగానూ, నా శక్తికి మించినదిగానూ తోచింది. ఇప్పుడు చాలా సాధారణంగా వుంది. వాస్తవానికి ఈ పని నాకు సంతోషాన్ని, సుఖాన్ని ఇచ్చింది. ప్రసవించేవరకు విశ్రాంతి తీసుకోవాలనుకున్నాను.

ఊరు దగ్గరకు వచ్చేసరికి సాయంకాలమైంది. సూర్యుడు అస్తమించబోతున్నాడు. తేనె, పసుపు కలిపిన రంగులో వెలుతురు ఆకాశాన్ని అలుముకుంది. సముద్రతీరంలో వుండే మేము వర్షాకాలంలో ఒక్కొక్కప్పుడు ప్రకాశవంతమైన వెచ్చని రోజులను అనుభవిస్తూ వుంటాం. సముద్రంపై వాన కోయిల గుంపులు ఎగురుతూ వున్నాయి. తీరానికి దూరంగా వున్న తిమింగలం దీవి స్పష్టంగా కన్పిస్తోంది. దానిని చూడగానే పాత స్మృతులు జ్ఞాపకం వచ్చి నాలో ఉద్రేకాన్ని కలిగించాయి. సాయంకాలం మంచులో స్నానం చేస్తున్న ఆ దీవిని చూస్తూ బోటు కోసం తీరం అంచున భర్త పక్కన కూర్చున్న ఘటన గుర్తొచ్చింది. నా భర్త చనిపోయాడు. కానీ, ఆ తిమింగలం దిబ్బ అక్కడే వుంది. సూర్యరశ్మితో కాంతివంతమైన ఆకాశానికి ఎదురుగా వైలెట్ రంగుతో నిలబడే వుంది. ఆ రాత్రి మేమిద్దరం కలుసుకోవడం ఆఖరిసారి అవుతుందని నేను ఊహించలేదు. చనిపోయినా ఆయన దివ్యమంగళ విగ్రహం నా హృదయంలో హత్తుకుని వుంది. ఆయన అంశ నా గర్భంలో పెరుగుతూ వుంది. త్వరలోనే జననమొందుతుంది.

పొట్ట పెరిగింది. లోన బిడ్డ కదులుతున్నట్లు తెలుస్తోంది. మగబిడ్డ పుట్టాలని నా కోరిక. ఆ పుట్టిన బిడ్డ బలంగానూ, అందంగానూ వుంటుందని నా నమ్మకం. కోర్కెలు నాలో మెదులాడగానే, విచారం నన్ను ఆవరించింది. బిడ్డను చూడకుండానే అయన అంత తొందరగా ఎందుకు చనిపోయాడు?

కంకర రోడ్డుదాటి మేము సముద్రతీరం చేరుకున్నాం. అక్కడి నుండి నెమ్మదిగా నడక సాగించాం. ప్రమాద ప్రాంతం తప్పుకున్నామని మా నమ్మకం. విపత్తు మమ్మల్ని వెన్నంటి వస్తోందని మేము గుర్తించనే లేదు. హీప్‌లో దగ్గర మెయిన్‌రోడ్డు దాటినప్పుడు సావోట్రీ శిబిరంలో వున్న శత్రువులు మమ్మల్ని చూశారు. అనుమానించి మా వెనుక నలుగుర్ని పంపించారు. మేము ఇసుకలో నడుస్తున్నప్పుడు బూట్ల చప్పుడు విని, వెనుదిరిగి చూస్తే, వంద గజాల దూరంలో వాళ్లు మాకు కనపడ్డారు. లువాంగ్ భయపడ్డాడు.

(ఇంకా వుంది)

పచ్చపచ్చని పుచ్చకాయ

చల్లచల్లగా...

వేసవి రోజు మధ్యాహ్నం పుచ్చకాయ ముక్క తినడమంత చల్లని అనుభూతి మరోటి లేదు. పైన పచ్చటి పొర. లోపల ఎర్రని గుజ్జు, దాని మధ్యలో అక్కడక్కడా నల్లని గింజలు. నోటిలో తియ్యగా పంచదార రసంలా పుచ్చకాయ ముక్క ఊరుతుంటే ఆ మజాయే వేరు.



ఇంతటి రుచికరమైన మేము వేసవి కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డామా అన్నంతగా అనిపిస్తుంది కదూ? విశేషమేమిటంటే, అసలు మేము పుట్టిందే ఎండలు మండే ఎడారులలో. ఆఫ్రికా, భారత్, దక్షిణ ఇటలీ దేశాలలో ఎక్కడ తొలుత జన్మించామో నిజానికి మాకే ఇదమిద్ధంగా తెలియదు. కానీ, ఆయా దేశాల ఉష్ణ ప్రాంతాలలో మాత్రం పుట్టామని కచ్చితంగా తెలుసు. దాదాపు అయిదు వందల ఏళ్ల క్రితమే మమ్మల్ని ఈజిప్టులో సాగు చేసేవారని తెలుస్తోంది. అలాగే ఆఫ్రికాలోని కలహరి ఎడారిలో మేం విస్తృతంగా పండుతాము. ఆఫ్రికాలో చాలా తియ్యని పుచ్చకాయని తింటారు. బహుశా ఆ జాతి నుండి మేము విస్తరించి వుంటాము. ఇప్పుడు ఆస్ట్రేలియాతో సహా 96 దేశాలలో మేం పండుతున్నాం. అయితే మా అభివృద్ధిలోనూ, రూపు, రుచులలోనూ ఏదో మార్పు, వైవిధ్యం ఏర్పడింది. ప్రస్తుతం మేం దాదాపు పన్నెండు వందల రకాలలో లభ్యమవుతున్నాం.

వేడి ప్రాంతాలలో పండడం వల్ల మాకు మాలో నీరు నిల్వ చేసుకోవడం అలవాటైంది. అది మాకు మంచిది. మా రుచి మరిగాక మీకూ మంచిదే! మాలో మీకు చాలా అవసరమైన విటమిన్ సి, విటమిన్ ఎ తయారు కావడానికి ఉపయోగపడే కెరోటినాయిడ్లు (ఇవి బాగా ముదురు పచ్చరంగులో వున్న కాయలలో మరింత ఎక్కువ), పీచు, తీపి కలిగించే సుక్రోజ్, కొద్దిగా ఫ్రక్టోజ్ కూడా వుంటాయి. మాలో ఉన్నంత సుక్రోజ్ మరే ఇతర 'మెలన్'లోనూ వుండదు.

మాలో అస్సలు కొవ్వు లేదు. మాలో ఏడు శాతం చెక్కర, తొంబై మూడు శాతం నీరు వుంటుంది. కాబట్టి ఆరోగ్యానికి మేం ఎంతో మేలు చేస్తాము. కేవలం ఎండలో దాహాన్ని తీర్చడమే కాక మేము ఆస్తమా, డయాబెటిస్, కీళ్ల నొప్పులు, క్యాన్సర్ వంటి వ్యాధులకు కారకమైన పరిస్థితులను నివారిస్తాము.

మీ శరీరాలలో ఫ్రీ రాడికల్స్ అనే పదార్థాలు తిరుగుతూ ఉంటాయి. వీటి వల్ల హాని కలగవచ్చు. ఇవి కొలస్ట్రాల్‌ని రక్తనాళాలకి అంటుకునేలా చేస్తాయి. అలాగే ఇవి శ్వాస నాళికలను సంకోచింపచేసి ఆస్తమాని తీవ్రతరం చేస్తాయి. వీటిని అరికట్టడానికి యాంటి ఆక్సిడెంట్లు అవసరం. మాలోని లైకోపిన్, విటమిన్ సి, బీటా కెరోటిన్ వంటివి యాంటి ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి.

సౌందర్యానికి...

మేము సౌందర్య సాధనాలుగా కూడా పనిచేస్తాము. మాలోని గుజ్జును పిండి రసం తీసి మొహం మీద రాసుకుంటే ఎండలో కూడా ఎంతో ఫ్రెష్‌గా వుంటుంది. అలాగే గుజ్జును కూడా ఫేస్‌ప్యాక్‌గా వాడవచ్చు.

కొనేటప్పుడు...

ఇప్పుడు మార్కెట్‌లో చాలా కనిపిస్తున్నాయి. కానీ మమ్మల్ని కొనేప్పుడు కొంచెం జాగ్రత్త వహించండి.

మంచి ఆకుపచ్చ రంగుకోసం చూడండి. పాలిపోయిన రంగు కాయలు తీసుకోవద్దు. కాయపై వేలితో కొడితే బోలు శబ్దం రావాలి. అలా అయితే అది బాగా పండిన కాయ. అలాగే బరువుగా వుండాలి. తేలికగా వున్నది మంచిది కాదు.



ఇలా కూడా తినొచ్చు

♦ఆసియా దేశాల్లో పుచ్చకాయ గింజలను వేయించుకొని తింటారు. అలాగే వాటిని పిండి పట్టించుకొని బ్రెడ్ తయారీకి వాడతారు.

♦కొన్ని దేశాలలో పుచ్చకాయ తొక్కతో పచ్చడి చేసుకుంటారు.

♦పుచ్చకాయ ముక్కల్లో సన్నటి ఉల్లిపాయ ముక్కలు కలిపి, వాటిమీద కొద్దిగా ఉప్పు, మిరియాలపొడి చల్లితే వేసవి సలాడ్ సిద్ధమైనట్లే.

♦ఫ్రూట్ సలాడ్‌కు రుచి రావాలన్నా, కంటికింపుగా కనిపించాలన్నా పుచ్చకాయ ముక్కలు వుండి తీరాల్సిందే.

♦ఇజ్రాయిల్, ఈజిప్టులలో పుచ్చకాయమీద ఉప్పు చల్లుకుని కూడా తింటారు.

♦విత్తులు, తోలుతో సహా పుచ్చకాయలోని ప్రతి భాగాన్ని తింటారు.



ముందుగా కోసినవా...

సాధ్యమైనంత వరకు కాయలుగానే కొనండి. మాలోని తీపి సూక్ష్మక్రిములను ఇట్టే ఆకర్షిస్తుంది. అందుచేత ముందే కోసి ముక్కలు చేసి అమ్మేవాటికి వీలైనంత దూరంగా వుండాలి.. పైగా అందుకోసం వాడే ఐస్ కూడా మంచిదనే నమ్మకంలేదు.

అంతా తినొచ్చు...

మాలో ప్రతిభాగమూ తినడానికి పనికివస్తుంది. మీలో చాలామంది తినరు కానీ, మా బయటి తోలు, లోపలి గింజలు కూడా తినేవాళ్లు వున్నారు.

మా గురించి మీకు తెల్సా!

○ప్రపంచవ్యాప్తంగా 1200 రకాల పుచ్చకాయలను పండిస్తారు.

○పుచ్చకాయ దాహార్తిని తీర్చడమేకాక ఆస్తమా, డయాబెటిస్, ఆర్థ్రైటిస్, కొలాన్ క్యాన్సర్ తీవ్రతను తగ్గిస్తుంది.

○ఇది మంచి ఆరోగ్యకర ఆహారం. ఎందుకంటే ఇందులో కొవ్వు, కొలెస్ట్రాల్ వుండవు. పీచు పదార్థం ఎక్కువ. విటమిన్ 'ఎ, బి6, సి' ఎక్కువ. పొటాషియమ్ కూడా పెద్ద మోతాదులోనే వుంటుంది.

○మనందరం అనుకుంటున్నట్టు పుచ్చకాయ పండు కాదు. ఇదీ ఓ రకమైన కూరగాయే. దోస, గుమ్మడి కుటుంబానికి చెందినది.

○మొట్టమొదట పుచ్చకాయను నీళ్ల చెంబులాగా ఉపయోగించేవారు.

○ప్రపంచవ్యాప్తంగా 96కు పైగా దేశాలలో పుచ్చకాయను పండిస్తున్నారు.

○చైనా, జపాన్ వంటి దేశాలలో ఎవరినైనా పలకరించడానికి వెళ్లేప్పుడు మర్యాదపూర్వకంగా పుచ్చకాయను బహూకరిస్తారు.

ఆకారంలో ఏముంది?

ఇక మేము సాధారణంగా గుండ్రంగా లేదా కాస్త పొడవుగా పెరుగుతుంటాము. కానీ మా సహజ ఆకారం నచ్చినట్లు లేదు కొంతమందికి... మేము పెరిగే సమయంలో వారికి కావలసిన ఆకారాల డబ్బాలలో మమ్మల్ని ఇరికించి, వింత వింత ఆకృతులు రూపొందిస్తున్నారు. జిహ్వకో రుచి, పుర్రెకో బుద్ధి!! ఎండాకాలంలో పుచ్చుతో ఎంజాయ్ చేయండే...!!!

-డా॥విజయ్.

చుక్కలను కలిపేస్తే



			3				4	
5		6						
				2				7
8					7			
		5		6		9		3
	2		9				8	
	3			7				5
9			4		1		7	
		2				6		

సుడోకు

ఫ్రెండ్స్... మీకు సుడోకు గురించి తెలుసు కదా? ఏంచేయాలంటే ప్రతి లైనులోనూ ఒకటి నుండి తొమ్మిది వరకు అంకెలు వేయాలి. ఒక్కో లైనులో ఒక అంకె ఒకసారి మాత్రమే రాయాలి.

దారి చెప్దామా!

కింది బొమ్మలో బాబుకి ఐస్‌క్రీం అంటే చాలా ఇష్టం. కాని దారేమో తెలీదు. మనం సాయం చేద్దామా.



ఏం కనిపిస్తోందబ్బా!

హాయ్ నేస్తాలూ... ఎవరీ బూచోడు అనుకుంటున్నారా? ఇతను బూచోడు కాదు మంచోడే. కాస్త జాగ్రత్తగా చూడండి. అక్కడ ఇంకా అమ్మాయిలు కూడా కనిపిస్తున్నారు. అయితే అక్కడున్న అమ్మాయిలు ఎంతమందో చెప్పండి.

నేర్చుకుందాం





తేడాలు కనిపెట్టేస్తే పోలా...

గళ్లను పూరిద్దాం

ఫ్రెండ్స్...మేం కొన్ని క్లూలు ఇస్తాం. అవి ఏంటంటే 1) 6కి కింద 3 కుడివైపున 9 వుంటాయి. 2) 9కి పైన 2 కుడివైపున 11కొండు వుంటాయి. 3) 7 కింద నాలుగు, ఎడమవైపున 10 వుంటాయి. 4)1 కి కింద 8, కుడిపక్కన ఐదు వున్నాయి . 7 కి కుడివైపున 8 వుంటుంది. వీటి ఆధారంగా కింద ఇచ్చిన గళ్లని 1 నుండి 11అంకెలతో పూర్తి చేయండి.





ఆరుతో పది ఎలా?

హాయ్... ఇవాళ మీకో పజిల్ తెచ్చామర్రా. పైన అగ్గి పుల్లల అమరిక వుంది కదా. వాటిలో ఆరు పుల్లలను తీసేస్తే పది వస్తుంది. ఎక్కడి పుల్లలను తీస్తే పది వస్తుందో తీసి చూడండి.

జవాబులు

ఏం కనిపిస్తోందబ్బా... :
ఏడుగురు అమ్మాయిలు.

ఆరుతో పది ఎలా?...:



గళను పూరిద్దాం...:



సుడోకు....:

2	1	7	3	8	6	5	4	9
5	4	6	7	1	9	2	3	8
3	8	9	5	2	4	1	6	7
8	9	1	2	3	7	4	5	6
4	7	5	1	6	8	9	2	3
6	2	3	9	4	5	7	8	1
1	3	4	6	7	2	8	9	5
9	6	8	4	5	1	3	7	2
7	5	2	8	9	3	6	1	4

అట్టమీది కథ



హక్కుల మంత్రం మారణ తంత్రం

- వరప్రసాద్

ప్రపంచం మొత్తం మీద మానవహక్కులను గౌరవించేది తాము మాత్రమే అని ఫోజు పెట్టే దేశం ఏదయా? అంటే టక్కున వచ్చే సమాధానం అమెరికా. అమెరికా విదేశాంగశాఖ ఈ నెల 11వ తేదీన మానవ హక్కులపై తన 2009 నివేదికను వెలువరించింది. గతంలో మాదిరిగానే ఈ నివేదికలో కూడా చైనాతో సహా ప్రపంచంలోని 190 దేశాలపై విమర్శలు గుప్పించిన అమెరికా తమ భూభాగంలో జరుగుతున్న హక్కుల ఉల్లంఘనను విస్మరించింది. అసలా దేశంలో మానవహక్కుల అమలెలా వుంది? ఈ విషయంలో పోలీసుల తీరు ఎలా వుంది? మహిళలు, పిల్లల హక్కులకు రక్షణ వుందా? ఆ సమాజంలో నేరాలు, జైళ్లు ... వంటి అంశాలు ఈ వారం అట్టమీది కథలో...

అమెరికాలో నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దాంతో అక్కడి ప్రజల జీవితాలకు, ఆస్తులకు, వ్యక్తిగత భద్రతకు ముప్పు వాటిల్లుతోంది. 2008లో అమెరికాలో 49 లక్షల హింసాత్మక నేరాలు, ఆస్తులకు సంబంధించి 1.63 కోట్ల నేరాలు, 1,37,000 వ్యక్తిగత చోరీలు జరిగాయి. అమెరికా న్యాయశాఖ గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రచురించిన నివేదిక ప్రకారం 12 ఏళ్లలోపున్న ప్రతి వెయ్యి మందిలో హింసాత్మక నేరాల బారిన పడిన వారి సంఖ్య 19.3 శాతం వుంది. 2009లో ఫిలడెల్ఫియాలో 35 హత్యలు నమోదయ్యాయి. ఇవి అంతకు ముందు సంవత్సరం కంటె 67 శాతం ఎక్కువ. న్యూయార్క్ నగరంలో గత ఏడాది 461 హత్యలు నమోదయ్యాయి. క్రైమ్ రేటు 1.151గా నమోదైంది. అంటే ప్రతి లక్ష మందిలో 1,151 మంది హత్యకు గురయ్యారన్నమాట. అమెరికాలోని అన్ని నగరాల్లో టెక్సాస్‌లోని శాన్‌ఆంటోనియో నగరం అన్నింటికన్నా అత్యంత ప్రమాదకరమైనదిగా పేరుతెచ్చుకుంది. ఇక్కడ ప్రతి లక్ష మందికి 2,538 నేరాలు (2.538 శాతం) నమోదయ్యాయి. మొత్తమ్మీద అమెరికాలోని నగరాలన్నింటిలో ఏటా 15,000 హత్యలకు తక్కువ కాకుండా జరుగుతున్నాయి. ప్రపంచంలో అన్ని దేశాల కన్నా అమెరికాలోనే ఎక్కువ ప్రైవేటు ఆయుధాలు వున్నాయి. అమెరికా కేంద్ర నిఘా సంస్థ (ఎఫ్‌బిఐ), బ్యూరో ఆఫ్ ఆల్కహాల్, టుబాకో, ఫైర్ ఆర్మ్స్, ఎక్స్‌ప్లోజివ్స్ (ఎటిఎఫ్) రూపొందించిన గణాంకాల ప్రకారం అమెరికా మొత్తం జనాభాలో ప్రతి 30.9 కోట్ల మందికీ 25 కోట్ల తుపాకులున్నాయి. అమెరికన్లు ఏటా 700 కోట్ల రౌండ్ల తూటాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే 2008లో ఈ సంఖ్య 900 కోట్లను దాటింది. అమెరికాలో విమాన ప్రయాణికులను లోడ్ అయిన తుపాకులతో అనుమతిస్తారు (డిక్లరేషన్ ఇచ్చిన తరువాతే అనుకోండి). అమెరికాలో ఏటా తుపాకీ సంబంధిత ప్రమాద ఘటనల్లో 30 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఎఫ్‌బిఐ లెక్కల ప్రకారమే 2008లో 14,180 హత్యలు నమోదయ్యాయి. ఈ తుపాకులను హత్యల్లో 66.9 శాతం, దోపిడీల్లో 43.5 శాతం, ఇతర నేరాల్లో 21.4 శాతం ఉపయోగిస్తున్నారు. ఇక విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు విద్యకు కాక హింసాత్మక నేరాలకు నిలయాలుగా మారాయి. ఇటీవలి కాలంలో యూనివర్శిటీలలో తుపాకుల మోతలు బాగా పెరిగిపోయాయి.

హక్కుల ఉల్లంఘన

అమెరికా పౌరుల రాజకీయ, పౌర హక్కులపై గట్టి నియంత్రణ ఉండటమే కాక ప్రభుత్వం వాటిని తీవ్రంగా ఉల్లంఘిస్తోంది. అమెరికా పోలీసులు చీటికీ మాటికీ ప్రజలపై హింసాకాండకు దిగటం పరిపాటిగా మారిపోయింది. చట్టాన్ని అమలుపర్చే ప్రక్రియలో తీవ్రమైన హింసకు దిగిన దాదాపు 315 మంది పోలీసు అధికారులను అంతర్గత పర్యవేక్షణ (ఇది ఒక శిక్ష వంటిదే)కు పంపినట్లు చికాగో డిఫెండర్ పత్రిక వెల్లడించింది. 2007లో ఈ సంఖ్య కేవలం 210 మాత్రమే. గత రెండేళ్ల కాలంలో న్యూయార్క్ పోలీసు అధికారుల్లో 50 శాతానికి పైగా ఇటువంటి ఫిర్యాదులను ఎదుర్కొన్నారు. న్యూయార్క్ పోలీసు విభాగం ఆయుధాల నిర్వహణ నివేదిక ప్రకారం 2007లో న్యూయార్క్ నగర పోలీసులు 588 బుల్లెట్లను ఉపయోగించి 10 మందిని హతమార్చారు. 2008లో వారు 354 బుల్లెట్లను ఉపయోగించి 13 మంది ప్రాణాలు తీశారు.

ఎయిడ్స్ వారధులు

అస్తవ్యస్త నిర్వహణ కారణంగా జైళ్లలో పలువురు ఖైదీలు రోగాల బారిన



పడుతున్నారు. అమెరికా న్యాయశాఖ లెక్కల ప్రకారం 2008లో ఫెడరల్, రాష్ట్ర జైళ్లలో వున్న మొత్తం ఖైదీలలో 20,231 మంది పురుషులు, 1,913 మంది మహిళా ఖైదీలను వైద్యాధికారులు హెచ్ఐవి క్యారియర్లుగా నిర్ధారించారు. హెచ్ఐవి/ఎయిడ్స్ బారిన పడిన పురుష, మహిళా ఖైదీల నిష్పత్తి 1.5:1.9గా నమోదయింది. 2007లో ఎయిడ్స్, సంబంధిత ఆరోగ్య సమస్యల కారణంగా 130 మందికి పైగా ఖైదీలు మరణించారు. హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ గత ఏడాది మార్చిలో విడుదల చేసిన అధికారిక లెక్కల ప్రకారం న్యూయార్క్ రాష్ట్ర ప్రధాన జైలులో దేశంలోకెల్లా అత్యధికంగా హెచ్ఐవి వ్యాధిగ్రస్తులున్నారు. ఇక్కడి జైలులో వారికి తగిన చికిత్స కల్పించకపోగా కనీసం వారిని విడిగా ఉంచాలన్న ఆలోచన కూడా అధికారులకు కలగలేదు.

స్వేచ్ఛ ప్రతిమకే పరిమితమా?

ఇక భావ ప్రకటనాస్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యం, ఇంటర్నెట్ స్వేచ్ఛ వంటి పదాలకు అమెరికాలో బహుశా స్థానం లేనట్టే. పౌరుల స్వేచ్ఛకు సంబందించిన హక్కులను అమెరికా ప్రభుత్వం తన అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటుంది. అమెరికన్ పౌరులు ఒక సమాచారాన్ని నలుగురికీ తెలియచేయాలన్నా, ఎక్కడినుండైనా దానిని పొందాలన్నా ప్రభుత్వ నిశిత పర్యవేక్షణలో జరగాల్సిందే. మీడియా కథనాల ప్రకారం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ఫోన్‌కాల్స్, ఫాక్స్‌లు, ఇ మెయిల్స్ వంటి వాటిని టాప్ చేసేందుకు అమెరికా జాతీయ భద్రతా సంస్థ దేశవ్యాప్తంగా అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఈ టాపింగ్ తొలుత అరబ్ అమెరికన్లకు ఉద్దేశించినప్పటికీ దానిని ఇతరులకు కూడా విస్తరించారు. సెప్టెంబర్ 11 దాడుల తరువాత ఉగ్రవాద వ్యతిరేక పోరుతో పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని హాక్ చేసేందుకు ఇంటెలిజెన్స్ సంస్థలు, అధికారులకు ప్రభుత్వం అనుమతించింది. అమెరికా పేట్రియాట్ చట్టం ప్రకారం ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం వున్నట్లు అధికారులు ఎవరినైనా అనుమానిస్తే వారి కమ్యూనికేషన్, వైద్య, ఆర్థిక, వ్యక్తిగత రికార్డులను క్షుణ్ణంగా తిరగేసేందుకు భద్రతా దళాలకు అధికారం కల్పించబడింది. ఇది చాలదన్నట్టు గత సెప్టెంబర్‌లో ఇంటర్నెట్ భద్రతా పర్యవేక్షణా సంస్థను అమెరికా ఏర్పాటు చేసింది. ఈ సంస్థకు అమెరికన్ల వ్యక్తిగత సిస్టమ్స్‌లోకి కూడా చొరబడి సమాచారాన్ని హాక్ చేసే అధికారముంది. ఇందులో అమెరికన్ సైన్యం కూడా ఏమీ తక్కువ తినలేదు. అనధికార ప్రైవేట్ బ్లాగులు, అధికారిక పత్రాలు, వ్యక్తిగత కాంటాక్ట్ సమాచారం, ఆయుధాల ఫొటోలు, సైనిక శిబిరాల ప్రవేశ ద్వారాలు, 'జాతీయ భద్రతకు విఘాతం కల్పించే' వెబ్‌సైట్ల పర్యవేక్షణ బాధ్యతలను వర్జీనియాకు చెందిన అమెరికన్ సైనిక ఇంటర్నెట్ రిస్క్ ఎవాల్యుయేషన్ సంస్థకు అప్పగించారు. అమెరికాలో పత్రికా స్వేచ్ఛ ప్రభుత్వ కనుసన్నల్లో కొనసాగుతుంటుంది. అమెరికా ప్రభుత్వం, రక్షణ శాఖ పెంటగాన్ మాజీ సైనికాధికారులను టీవీ, రేడియో వ్యాఖ్యాతలుగా నియమించి ప్రభుత్వానికి అనుకూల విశ్లేషణలు, ఇరాక్, ఆఫ్ఘన్లలో పరిస్థితిపై 'సైనిక నిపుణుల' విశ్లేషణలు వినిపిస్తుంటుంది. అమెరికాలో హింసను ప్రేరేపిస్తున్నాయన్న ఆరోపణలతో పలు అరబ్ ఉపగ్రహఛానళ్ల ప్రసారాలపై గత ఏడాది చివరిలో కాంగ్రెస్ ఆంక్షలు విధించింది. ట్విటర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక నెట్‌వర్కింగ్ సైట్లపై కూడా సర్కారు నిఘా నేత్రం పడటంతో గత సెప్టెంబర్‌లో పలువురు నిరసన వ్యక్తం చేస్తూ పోలీసులతో ఘర్షణలకు కూడా దిగారు.

హక్కులు హుష్ కాకి

పేదరికం, నిరుద్యోగం, నివాససౌకర్యం లేమి వంటి తీవ్రమైన సమస్యలున్న అమెరికాలో కార్మికులు, ఉద్యోగుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు గ్యారంటీ లేదు. గడచిన 26 ఏళ్ల కాలంలో 2009లో గరిష్టస్థాయికి చేరింది ఇక్కడి నిరుద్యోగం. ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక మంది తమ వ్యాపారాలు మూసివేశారు. గత డిసెంబర్ 4తో ముగిసిన ఏడాది కాలంలో 130కి పైగా బ్యాంకులు



కిక్కిరిసిన జైళ్లు

అమెరికాలో జైళ్లన్నీ ఖైదీలతో కిటకిటలాడుతున్నాయి. గత డిసెంబర్‌లో అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన లెక్కల ప్రకారం 2008 సంవత్సరాంతానికి 73 లక్షల మంది ఖైదీలు వివిధ జైళ్లలో మగ్గుతున్నారు. ఇది అంతకు ముందు ఏడాది కంటె 0.5 శాతం ఎక్కువ. గత ఏడాది దాదాపు 23 లక్షల మందిని పోలీసులు కస్టడీలోకి తీసుకుని జైళ్లకు పంపారు. ఇది దేశంలోని ప్రతి 198 మందిలో ఒకరితో సమానం. 2000 నుండి 2008 వరకూ అమెరికన్ జైళ్లలో ఖైదీల సంఖ్య ఏటా 1.8 శాతం వంతున పెరుగుతూ వచ్చింది. ఇక జైళ్లలోని ఖైదీలకు ప్రాథమిక హక్కులు కలలోని మాటే. జైలు సిబ్బంది మహిళా ఖైదీలపై అత్యాచారాలకు పాల్పడే ఘటనలు కోకొల్లలు. అమెరికా న్యాయశాఖ లెక్కల ప్రకారం దేశంలోని 93 ఫెడరల్ జైళ్లలోని ఖైదీలపై జైలు సిబ్బంది లైంగిక వేధింపులు గత ఎనిమిదేళ్ల కాలంలో రెట్టింపయ్యాయి. ఇందులో 90 మందిపై ప్రాసిక్యూషన్ జరగ్గా అందులో కేవలం 40 శాతం మందికి మాత్రమే శిక్షపడింది. 2009లో జరిగిన ఫెడరల్ సర్వే ప్రకారం ఫెడరల్, రాష్ట్ర జైళ్లలోని దాదాపు 63 వేల మంది ఖైదీలపై జైలు సిబ్బంది అత్యాచారాలకు పాల్పడ్డారు. అంటే గత 12 నెలల కాలంలో 4.5 శాతం మంది ఖైదీలు కనీసం ఒక్కసారైనా లైంగిక వేధింపులకు గురయ్యారన్నమాట.



మూతపడ్డాయి. ఇక అమెరికాలో పేదల సంఖ్య గత 11 ఏళ్ల కాలంలో విపరీతంగా పెరిగింది. 2008 చివరి నాటికి 3.98 కోట్ల మంది అమెరికన్లు పేదరికంలో మగ్గుతున్నారని గత సెప్టెంబర్‌లో వాషింగ్టన్ పోస్ట్ పత్రిక వెల్లడించింది. పెరిగిన పేదరికంతో పాటే అమెరికాలో ఆత్మహత్యలు కూడా పెరిగాయి. ఏటా సుమారు 32 వేల మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అధికారిక అంచనాలు వివరిస్తున్నాయి. ఆకలితో కొట్టుమిట్టాడుతున్న వారి సంఖ్య గత 14 ఏళ్ల కాలంలో బాగా పెరిగింది. అమెరికా వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం అమెరికాలో 1.7 కోట్ల ఇళ్లలో నివసిస్తున్న 4.91 కోట్ల మంది అమెరికన్లకు సరైన ఆహారం అందుబాటులో వుండటం లేదు. ఇది మొత్తం అమెరికన్ కుటుంబాలలో 14.6 శాతానికి సమానం. కనీస స్థాయిలో కూడు, గుడ్డ కోసం 15 శాతం అమెరికన్ కుటుంబాలు కష్టపడుతున్నాయి. అమెరికా మొత్తం జనాభాలో 8వ వంతు మంది సుమారు 3.65 కోట్ల మంది గత ఆగస్టులో ప్రభుత్వం ఇచ్చే ఆహార కూపన్ల కోసం క్యూ కట్టారు. ఇక కార్మిక హక్కుల ఉల్లంఘన సంగతిని ప్రస్తావించటం కూడా కష్టసాధ్యమే. అంత తీవ్రస్థాయిలో వుంది. గత ఏడాది దాదాపు 4,387 మంది తక్కువ వేతనాలందుకుంటున్న కార్మికులకు వేతనాల్లో కోత పడినట్లు ఒక సర్వేలో తేలింది. ఓవర్‌టైమ్ చేసినా తమకు సరైన వేతనం అందటం లేదని దాదాపు 75 శాతం మంది కార్మికులు వాపోయారు. న్యూయార్క్‌లో ఏటా 2 లక్షల మందికి పైగా కార్మికులు పనిస్థలాల్లో గాయపడటం లేదా జబ్బుపడటం జరిగినా పట్టించుకునే నాథుడే లేడట. వైద్య బీమా సౌకర్యం లేని వారి సంఖ్య గత ఎనిమిదేళ్లలో ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. అమెరికాలో 34 శాతానికి పైగా కుటుంబాల వార్షికాదాయం 50 వేల డాలర్లలోపే నని ఒక సర్వే తేల్చి చెప్పింది. 28 శాతానికి పైగా అమెరికన్లు తాము జబ్బు పడితే కనీసం వైద్యుని వద్దకు వెళ్లటానికి కూడా సుముఖులుగా లేరట. కనీసం 25 శాతం మంది వైద్య బిల్లులను భరించే స్థితిలో లేరట. కనీసం 22 శాతం మంది తమ చికిత్సలను వాయిదా వేసుకుంటున్నారట.

అమెరికాలో నిరుద్యోగులే కాదు నిర్వాసితుల సంఖ్య కూడా గణనీయంగానే పెరుగుతోంది. 2008 సెప్టెంబర్ నాటి లెక్కల ప్రకారం 16 లక్షల మంది ప్రజలు ప్రభుత్వ సహాయ శిబిరాలలో ఆశ్రయం పొందారు. 2009 నాటి నుండి చికాగోతో సహా మరో ఆరు కౌంటీలలో ఈ నిర్వాసితుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ప్రభుత్వ హౌసింగ్ సబ్సిడీలు, సహాయం అందవన్న భయంతో గత అక్టోబర్‌లో డెట్రాయిడ్‌లో కొన్ని వేల మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గత డిసెంబర్‌లో దాదాపు 6,975 మంది వృద్ధులు ప్రభుత్వ శిబిరాలలో ఆశ్రయం పొందారు.

జాతి వివక్ష

అమెరికా స్వాతంత్ర్యం పొంది శతాబ్దాలు దాటినా అక్కడ జాతి వివక్ష మాత్రం ఇప్పటికీ తీరని సమస్యగానే మిగిలింది. అమెరికాలో వుంటున్న నల్ల జాతీయులు, ఇతర మైనార్టీ వర్గాల వారు అత్యంత పేదరికంలో మగ్గుతున్నారు. అమెరికా జన గణన బ్యూరో లెక్కల ప్రకారం అమెరికన్ల సగటు వార్షికాదాయం 50,303 డాలర్లు. ఇందులో నాన్ హిస్పానిక్ హౌస్‌హోల్డర్లు 55,530 డాలర్లు, హిస్పానిక్ హౌస్‌హోల్డర్లు 37,913 డాలర్లు, నల్లజాతీయులు కేవలం 34,218 డాలర్ల వార్షికాదాయాన్ని పొందుతున్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలలో మైనార్టీల పట్ల కొనసాగుతున్న వివక్ష అత్యంత తీవ్ర స్థాయిలోవుంది. అమెరికన్ నిరుద్యోగుల్లో ఎక్కువ మంది మైనార్టీ గ్రూపులకు చెందిన వారే. అమెరికా కార్మిక శాఖ గణాంకాల ప్రకారం 25 ఏళ్లు, అంతకు పైబడిన నల్లజాతి గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగుల సంఖ్య తెల్ల జాతి గ్రాడ్యుయేట్ల కన్నా రెట్టింపు ఎక్కువగా వుంది. ఫెడరల్ ఉద్యోగాలలో వివక్షకు సంబంధించిన ఫిర్యాదులు కుప్పలుగా పేరుకుంటున్నాయి. విద్యలో కూడా వీరికి వివక్ష తప్పటం లేదు. ఇక శాంతిభద్రతలు, న్యాయవ్యవస్థల్లో తెల్ల, నల్ల జాతీయుల మధ్య కొనసాగుతున్న వివక్ష అత్యంత తీవ్ర స్థాయిలో వుంది. సెప్టెంబర్ 11 దాడుల తరువాత ముస్లింలపై వివక్ష పెరుగుతోంది. ముస్లింలు తీవ్ర వివక్షకు గురవుతున్నారన్న భావన దాదాపు 58 శాతం మంది అమెరికన్లలో వుంది. అమెరికాలో వలసవాదులకూ వెతలు తప్పటం లేదు.



సమానత్వం కల్లే...

అమెరికాలో పిల్లలు, మహిళల హక్కులకు ఏవిధమైన గ్యారంటీ లేకపోవటంతో వారి జీవన పరిస్థితి నానాటికి తీసికట్టు... అన్న చందంగా తయారవుతోంది. సామాజిక, రాజకీయ రంగాలలో పురుషులతో సమానత్వం మహిళలకు కలలోని మాటే. అమెరికా జనాభాలో 51 శాతం మంది మహిళలుంటే కేవలం 92 మంది (17 శాతం)మాత్రమే ప్రస్తుత కాంగ్రెస్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అమెరికాలోని ధార్మిక, లాభాపేక్ష రహిత సంస్థల్లో ఉన్నత స్థానాల్లో ఎక్కువగా మహిళలు, మైనార్టీలే వున్నారని ఒక సర్వేలో వెల్లడయింది. ఉద్యోగావకాశాల్లో మాత్రమే కాక ఆర్థిక పరిస్థితుల్లోనూ ఇక్కడి మహిళలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

గురివింద తరహాలో...

తమ దేశంలో ఇన్ని రకాల హక్కుల ఉల్లంఘనలు తమ అధికారిక లెక్కల ద్వారానే బయటపడినా అమెరికా మాత్రం నిస్సిగ్గుగా గురివింద తరహాలో ఇతర దేశాలపై హక్కుల ఉల్లంఘన ఆరోపణలు చేస్తోంది. ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ విక్రయాల దేశమైన అమెరికా ప్రతిచోటా అస్థిరతకు ఆజ్యం పోస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రపంచంలో అత్యంత ఎక్కువ సైనిక వ్యయం చేస్తున్న ఈ దేశం ఇప్పుడు దానిని కూడా 10 శాతం మేర విస్తరించింది. ఆఫ్ఘన్, ఇరాక్‌లపై అమెరికా చేసిన దురాక్రమణ అమెరికన్లపై విపరీతమైన ఆర్థిక భారాన్ని మోపింది. అంతేకాదు ఇరాక్, ఆఫ్ఘన్ ప్రజలకు భయంకరమైన నష్టాన్ని మిగిల్చింది. ఇక ఆయా దేశాల్లో పట్టుబడిన ఖైదీలపై జరిగే అత్యాచారాల గురించి చెప్పాలంటే మాటలు చాలవు. ఈ వాస్తవాలన్నింటినీ పరిశీలిస్తే అమెరికా హక్కుల పరిరక్షణ చరిత్ర అత్యంత హేయమైనదే కాక ప్రపంచంలో ఎక్కడ ఉల్లంఘన జరిగినా దానికి స్ఫూర్తిగా నిలుస్తోందనటంలో అతిశయోక్తి లేదు. తనను తాను ప్రపంచ పోలీసుగా ప్రకటించుకుంటూ ఇతర దేశాలపై హక్కుల ఉల్లంఘన ఆరోపణలు సంధిస్తున్న అమెరికా తన సొంత ఇంటిలో హక్కులను మాత్రం అటకెక్కిస్తోంది. ఇది అత్యంత విచారకరమైన విషయం. ★

సినిమా కబుర్లు

మా భూమికి ముప్పయ్యేళ్లు!

వీర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట చరిత్ర ఆధారంగా తీసిన మహత్తర చిత్రం 'మా భూమి' 1980లో విడుదలైంది. అప్పట్లో వీడియోలుగాని, ఛానళ్లుగాని లేవు. బి.నరసింగరావు, జి.రవీంద్రనాథ్‌లు చైతన్య చిత్ర పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి బెంగాలీ దర్శకుడు గౌతం ఘోష్ దర్శకత్వం వహించారు. గృహిణులకు అనుకూలంగా వుండేందుకోసం అప్పట్లో ఉదయం 11 గంటల ఆటల పద్ధతి ప్రవేశపెట్టారు (అంతకు ముందు కాలంలోనైతే 10 గంటలకు ఉదయం ఆట, మధ్యాహ్నం 2 గంటలకు మ్యాట్నీ వుండేవి). చిన్న చిత్రాలు, సమాంతర చిత్రాలు, డబ్బింగ్ చిత్రాలు విడుదల కావడానికి ఈ 11 గంటల ఆట పద్ధతి బాగా ఉపయోగపడేది. ఆ విధంగా విడుదలైన మా భూమి అంచనాలకు మించి 200 రోజులు జయప్రదంగా నడిచింది. ఒక విధంగా అది సంచలనమే.

తెలంగాణా సాయుధ పోరాటం భారత దేశంలోనేగాక ప్రపంచ విప్లవోద్యమాల చరిత్రలోనే స్థానం సంపాదించిన గొప్ప ప్రజా పోరాటం. నిజాం నిరంకుశత్వాన్ని ఆయన పాలనలో పాతుకుపోయిన ఫ్యూడల్ పీడనను, వెట్టిచాకిరీని తుదముట్టించిన మహత్తర అధ్యాయం అది. దానితో సంబంధం వున్న వారెందరో నిర్బంధం కారణంగా మద్రాసు వెళ్లి చలన చిత్ర రంగంలో తలదాచుకున్నారు. తర్వాత ప్రసిద్ధులైనారు కూడా. అయినా దానిపై పూర్తి స్థాయి చిత్రం రావడానికి దాదాపు ముప్పై ఏళ్ల పట్టింది! నక్సలైట్ రాజకీయాలకు ఆకర్షితుడై ఆర్ట్ లవర్స్ అసోసియేషన్, జన నాట్యమండలి వంటి ప్రజా కళా సంస్థలు స్థాపించారు. గద్దర్ వంటి ప్రజాగాయకులకు కూడా ఆయనే తొలి మార్గదర్శకుడు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన నరసింగరావు స్వతహాగా కవి, రచయిత, చిత్రకారుడు కూడా. రవీంద్రనాథ్ కూడా అభిరుచిగల నిర్మాత. ఈ ఇద్దరి కలయిక వల్లనే అపురూపమైన 'మా భూమి' చిత్రం రూపొందింది.

తెలంగాణా పోరాటానికి ప్రతీకగా పరిగణించబడిన సుంకర వాసిరెడ్డి నాటిక పేరు మా భూమి అన్నది తెలిసిందే. చిత్రానికి ఆ పేరును తీసుకున్నా ప్రసిద్ధ హిందీ అభ్యుదయ రచయిత కిషన్ చందర్ రచించిన జైత్రయాత్ర నవల ఆధారంగా ఈ చిత్రం తయారైంది. సాయిచంద్ ఈ చిత్రంతోనే కథానాయకుడుగా రంగ ప్రవేశం చేశారు. ఆయన సరసన హంస నాయికగా నటించినా తర్వాత కాలంలో ఆమె పెద్దగా కనిపించలేదు. కాకరాలతో పాటు భూపాల్, నరసింగరావు, ప్రాణ్ రావు వంటి వారితో సహా అప్పటికి కొత్తవారైన నటీనటులు ఈ చిత్రంలో సమర్ధంగా నటించి విజయానికి దోహదకారులైనారు. నరసింగరావు, ప్రాణ్‌రావులే మాటలు కూడా సమకూర్చారు. ప్రసిద్ధ చిత్రకారుడు వైకుంఠం కళా దర్శకుడుగా నాటి తెలంగాణా వాతావరణాన్ని కళ్లకు కట్టించగలిగారు. నటీనటులు, సాంకేతిక నిపుణల అంకితభావంతో పాటు అభ్యుదయ వాదులైన మరెందరో, తెర వెనక అందించిన వారందరి భాగస్వామ్యంతో మా భూమి సంచలన విజయం సాధించింది. తెలుగు ప్రజల ఉత్తమాభిరుచికి, ఉద్యమాభిమానానికి అదో సంకేతమైంది.

ఇక కథలోకి వస్తే...

అది తెలంగాణా గడ్డ అన్న కళా వాచస్పతి కొంగర జగ్గయ్య కంచుకంఠంతో చిత్రం మొదలవుతుంది. నాటి చారిత్రక నేపథ్యాన్ని కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజ్వరిల్లిన విప్లవ పోరాటాన్ని, వారిపై రజాకార్ల యూనియన్ సైన్యాల హింసాకాండను ఆ వ్యాఖ్యానం ప్రస్తావిస్తుంది. అక్కడి నుంచి దొరల అమానుషత్వాన్ని, కటిక పేదలైన పీడిత జనం బాధలను చిత్రిస్తూ సాగుతుంది. ఏదో తెలంగాణా గ్రామం గుండా సాగిపోతున్నామన్న భావన ముప్పిరిగొంటుంది.

దొరల కచ్చడం ముందు పరుగెడుతూ కింద పడి చనిపోయిన అభాగ్యులు, 'నీ కొడుకు పెద్దోడైనట్టున్నాడే, పశుల కాయడానికి తోలు' అని దొర తొత్తు శాసిస్తే ఆ పసిబాలుడు తన ఆశలకు సమాధి కట్టుకుని కొలువు కుదరడం, నీ పెళ్లాన్ని దొర తోల్కరమ్మన్నాడని గూండాలు లాక్కుపోవడం, 'ఇవన్నీ పట్టించుకుంటే మనం సంసారాలు చేసినట్టేనా' అని ఇతరులు భర్తను ఓదార్చడం.. పొలంలో పనిచేస్తుంటే బిడ్డ ఏడవడం విని పాలిచ్చేందుకు పరుగెత్తుకు వచ్చిన తల్లిని 'ఏదీ నీ తాన పాలున్నాయా చూపించు' అంటే పిండి చూపించడం, నేలమీద ఉమ్మి అది ఆరేలోగా పాలిచ్చి రమ్మని శాసించడం .. ఇలా వూహకందని రీతిలో నాటి దొరల వారి తాబేదార్ల రాక్షస పెత్తనం చూపించే అనేక ఘట్టాలు వుంటాయి. ఈ పరస్థితులలో రామయ్య తన ప్రేయసిని కూడా దొర బలవంతాన తీసుకుపోవడంతో తట్టుకోలేక వూరు వదలి హైదరాబాదు చేరతాడు. అక్కడ కార్మిక సంఘంతో పరిచయం కలిగి చదువు సంధ్యలు, చైతన్యం పెంచుకుంటాడు. అనుకోకుండా ఒకసారి అరెస్టయ్యి జైలుకు వెళ్లిన సందర్భంలో సాయుధ పోరాటం ప్రజ్వలన గురించి తెలుసుకుంటాడు. తన సహచరులకు లాల్ సలామ్ చెప్పి పోరాటంలో పాల్గొనేందుకు గ్రామం వెళతాడు. తర్వాత గెరిల్లా దళాలను నిర్మించడం, దొరను తరిమికొట్టి గడీలను ఆక్రమించడం జరుగుతుంది. అంతకు ముందు నిస్సహాయంగా బానిసత్వంలో మగ్గిపోయినవారే ఇప్పుడు నిప్పురవ్వలై మండుతారు. అయితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సైనిక చర్యను ఆసరా చేసుకుని అదే దొరలు కాంగ్రెస్ టోపీలతో ప్రవేశిస్తారు! 'కత్తులు దూసుకుపోయినా నెత్తురుటేరులు పారినా ఎత్తిన జెండా దించకోయ్ అరుణ పతాకకు జై' అన్న చరణాలతో చిత్రం ముగుస్తుంది.

ఈ చిత్రంలో గద్దర్ 'బండెనక బండి కట్టి ...' అని ఉత్తేజకరంగా పాడిన పాట ప్రత్యేకాకర్షణ. నిజానికి 'నైజాము సర్కరోడా నాజీల మించినోడా...' అంటూ యాదగిరి రాసిన పాటకు 'బండెనక బండి కట్టి...' అన్న ప్రతాపరెడ్డి పాట పల్లవిని జోడించి జనరంజకం చేసిన గాయకుడు గద్దరే. 'మా భూమి' చిత్రం దేశ విదేశాలలో ప్రముఖుల ప్రశంసలు పొందింది. ఆ పోరాట సమగ్ర స్వరూపాన్ని మరింత బాగా ఆవిష్కరించవలసిందనే వ్యాఖ్యలు కూడా సహజంగానే వచ్చాయి. కిషన్ చందర్ నవల పరిమితులు కూడా అందుకో కారణం. గౌతం ఘోష్ బెంగాల్ వామపక్ష ప్రభుత్వం నిర్మించిన ఘటక్ అనే చిత్రంతో తొలిసారి పరిచయమైన వ్యక్తి కావడం విశేషం. తర్వాత కాలంలో ఆయన తెలుగులో చిత్రాలు తీయలేదు. నరసింగరావు కూడా కళాత్మక చిత్రాల మార్గం పట్టారు. దాసిలో కూడా తెలంగాణా పరిస్థితులనే చిత్రించి జాతీయ బహుమతి పొందారు. అంతకు ముందు కాలంలో దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్లు' నవల ఆధారంగా తెలంగాణా యాసలో చిత్రం వచ్చింది. అక్కినేని నటించిన 'మనసు మాంగల్యం' చిత్రంలోనూ ఫ్లాష్‌బ్యాక్‌లో తెలంగాణా పోరాటం వుంటుంది. అయితే పూర్తిగా సాయుధ పోరాటాన్ని ఆధారం చేసుకున్న చిత్రం 'మా భూమి' మాత్రమే. ఆ రీత్యా అది ఎంతైనా స్మరణీయమే.

-తె.ర

కథ

మట్టిలో మాణిక్యం

ఒకరోజు సత్యం నా ఇంటికి వచ్చి "పూటకి గతిలేని వాడిగా ఉన్న నన్ను ఇంత ఉన్నతస్థాయికి మీరు తీసుకువచ్చారు. కానీ ఇంతవరకు నాకు వచ్చిన ఏ ఒక్క ప్రోగ్రాం పారితోషకంలోనుంచి ఒక్క రూపాయి కూడా మీరు ఆశించలేదు. అది మీ సంస్కారం, కళ మీద మీకు ఉన్న అపారమైన అభిరుచి. కానీ నా తృప్తి కోసం నేను మీకిచ్చే ఒక బహుమతిని తప్పనిసరిగా తీసుకోవాలి" అని ఒక కొత్త కారు 'కీస్'ని నా చేతిలో బలవంతాన పెట్టాడు. దీనికి నేను కూడా సంతోషంగా అంగీకరించాను. ఎందుకంటే అతణ్ణి తృప్తి పరిచాననే ఒక కారణంతో.

- కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి

హనుమాన్ జంక్షన్‌లో ఏలూరు బస్ కోసం ఎదురు చూస్తున్నాను. అప్పుడు "అదిగో అల్లదిగో శ్రీహరివాసము" అనే అన్నమాచార్య కీర్తన వినపడుతోంది. ఒక యాచకుడు శ్రావ్యంగా పాడుతున్నాడు. అక్కడ ఉన్న ప్రయాణికులు అతని పాటను మెచ్చుకుని అర్ధరూపాయి, రూపాయి చొప్పున ఎవరికి తోచినట్టు వాళ్లిచ్చారు. అతను నాదగ్గరకు వచ్చాడు. నేను ఒక అయిదు రూపాయల నాణెం ఇచ్చాను. అతను చిరిగిన బట్టలతో, పెరిగిన గడ్డంతో, తైల సంస్కారం లేని జుట్టుతో నీరసంగా కనిపించాడు. ఎవరైనా ధర్మం చేస్తేనే కదా అతని ఆకలి తీరేది! చామనఛాయ రంగులో ఉన్నాడు. కానీ అతని మొహంలో ఒక కళాకారుడు కనిపించాడు. అతని మీద నాకు అభిమానం ఏర్పడింది.

"నువ్వు సినిమా పాటలు నేర్చుకున్నావా?" అడిగాను.

"ప్రత్యేకంగా నేర్చుకోలేదండి. హోటళ్ల దగ్గర, ఫంక్షన్లు జరుగుతున్న చోట సినిమా పాటలు విని తరువాత బాగా వచ్చేవరకు సాధన చేస్తానండి"

"నువ్వు తెలుగు చక్కగా మాట్లాడుతున్నావ్. చదువుకున్నావా?"

"లేదండి. అందరూ మాట్లాడుతున్నప్పుడు వింటూ మంచి తెలుగు మాట్లాడడం అలవాటు చేసుకున్నానండి"

"నీకీ పరిస్థితి ఎందుకు వచ్చింది? నీ తల్లిదండ్రులు ఏం చేస్తుంటారు?"

"వాళ్లు బీదవాళ్లండి. పొట్ట పోసుకోవడానికి కూలి పనులు చేసేవాళ్లండి. నా చిన్నప్పుడే చనిపోయారండి. నాకు పాడడం తప్ప ఏ పనీ చేతకాదండి"

"నువ్వెక్కడుంటున్నావ్?"

ఎక్కడ తల దాచుకోవడానికి జాగా దొరికితే ఆ రాత్రికి అక్కడే నా నిద్ర"

"నీ కంఠం చాలా బాగుంది. నాతో ఏలూరు వస్తావా? నీకు జీవనోపాధి చూపెడతాను"

"అంతకంటే ఇంకేం కావాలండి? తప్పకుండా వస్తాను"

"నీ పేరు చెప్పావుకాదు"

"సత్తెయ్యండి"

"ఇప్పటి నుంచి నీ పేరు సత్తెయ్య కాదు. సత్యం"

"సరేనండి"

ఏలూరు బస్ వచ్చింది. ఇద్దరం బస్సు ఎక్కాం. ఏలూరుకు రెండు టిక్కెట్లు తీసుకున్నాను. ఏలూరు చేరుకున్నాక నా ఇంటికి తీసుకెళ్లి నా శ్రీమతికి, కొడుక్కి, కూతురికి అతణ్ణి చూపించాను.

"చాలా బాగా పాడతాడు. కానీ బీదవాడు. ఇతనికి ఒకదారి చూపించాలని ఇక్కడకు తీసుకువచ్చాను. ఇకనుంచి మనతో మన ఇంట్లోనే ఉంటాడు" అని పరిచయం చేశాను.

నాలాగానే నా ఇంట్లో అందరూ పాటలంటే చెవికోసుకుంటారు. వాళ్లు చాలా సంతోషించారు. నా ఇంటి కాంపౌండులోని గెస్ట్‌హౌస్‌లో అతను ఉండడానికి ఏర్పాటు చేశాను. నాది ఒక పెద్ద మేడ. సొంత వ్యాపారం ఉంది. నేను సత్యాన్ని జీవితాంతం పోషించగలను. ఆ ఆర్థిక స్థోమత నాకుంది. కానీ నా ఉద్దేశ్యం దైవదత్తంగా వచ్చిన ఆయన తియ్యని కంఠానికి తగిన పని కల్పించి ఒక గొప్ప గాయకునిగా అతణ్ణి పైకి తీసుకురావాలని.

ఒక్కరోజులో సత్యం రూపాన్ని సమాజం నలుగురి మధ్య గౌరవంగా కనపడేట్టు మార్చేశాను. సెలూన్లో క్రాఫ్ చేయించి, గడ్డం తీయించి, తలస్నానం చేయించి అతనికి నావి నాలుగు జతల బట్టలిచ్చాను. అతనికి ఫలహారం, కాఫీ, టీ, టిఫిన్లు మా ఇంట్లోనే మాతో పాటే జరిగే ఏర్పాటు చేయించాను. చాలా కాలంగా నేను సేకరించిన తెలుగు హిట్ సినిమా పాటల క్యాసెట్లు, ఒక టేప్‌రికార్డర్ అతనికి ఇచ్చాను. అతని పాటల సాధన గెస్ట్‌హౌస్‌లోనే.

సత్యంలో ప్రత్యేకత ఏంటంటే ఏ పాట పాడినా లలితమైనా, శాస్త్రీయమైనా ఒక్కసారి వింటే దాన్ని కరెక్టుగా వెంటనే అనుకరించి పాడగలగడం. మల్లీశ్వరి, జయభేరి, విప్రనారాయణ, శంకరాభరణం, సాగర సంగమం సినిమాల్లోని శాస్త్రీయ పాటలు కులగోత్రాలు, ఇద్దరు మిత్రులు, మిస్సమ్మ, అప్పు చేసి పప్పు కూడు, ఘర్షణ, నువ్వే కావాలి లాంటి సినిమాల్లోని లలిత సంగీత పాటలు శ్రద్ధగా విని వాటిని క్యాసెట్లలో ఉన్నట్లుగా చక్కగా పాడగలిగాడు. ఘంటసాల, మాధవపెద్ది పౌరాణిక చిత్రాల్లో పాడిన పద్యాలు కూడా అకారాలు, సంగతుల్లో ఏమాత్రమూ తేడా లేకుండా వినికిడి ద్వారా చక్కగా పాడి మా అందరినీ సత్యం ఆశ్చర్యపరిచాడు. మా ఇంట్లో వాళ్లు, వ్యాపారం మధ్యలో తీరిక చిక్కినప్పుడు నేను, అతనితో కోరిన

ఒక్కరోజులో సత్యం రూపాన్ని సమాజం నలుగురి మధ్య గౌరవంగా కనపడేట్టు మార్చేశాను. సెలూన్లో క్రాఫ్ చేయించి, గడ్డం తీయించి, తలస్నానం చేయించి అతనికి నావి నాలుగు జతల బట్టలిచ్చాను. అతనికి ఫలహారం, కాఫీ, టీ, టిఫిన్లు మా ఇంట్లోనే మాతో పాటే జరిగే ఏర్పాటు చేయించాను. చాలా కాలంగా నేను సేకరించిన తెలుగు హిట్ సినిమా పాటల క్యాసెట్లు, ఒక టేప్‌రికార్డర్ అతనికి ఇచ్చాను. అతని పాటల సాధన గెస్ట్‌హౌస్‌లోనే.

సత్యంలో ప్రత్యేకత ఏంటంటే ఏ పాట పాడినా లలితమైనా, శాస్త్రీయమైనా ఒక్కసారి వింటే దాన్ని కరెక్టుగా వెంటనే అనుకరించి పాడగలగడం. మల్లీశ్వరి, జయభేరి, విప్రనారాయణ, శంకరాభరణం, సాగర సంగమం సినిమాల్లోని శాస్త్రీయ పాటలు కులగోత్రాలు, ఇద్దరు మిత్రులు, మిస్సమ్మ, అప్పు చేసి పప్పు కూడు, ఘర్షణ, నువ్వే కావాలి లాంటి సినిమాల్లోని లలిత సంగీత పాటలు శ్రద్ధగా విని వాటిని క్యాసెట్లలో ఉన్నట్లుగా చక్కగా పాడగలిగాడు.

పాటలను పాడించుకుని ఆనందించేవాళ్లం. శాస్త్రీయ సంగీతంలోని సరిగమలు, రాగాల పేర్లు అతనికి తెలియకపోయినా ఒక్క స్వరస్థానం గానీ, రాగం గానీ తేడా లేకుండా పాడగలగడం అతనికి బర్త్ గిఫ్ట్ అనే చెప్పాలి.

ఇంక సత్యం విషయంలో నేను చేయాల్సిన పని అతనితో జనంలో పాడించి గాయకునిగా పైకి తీసుకురావడం. నాకు తెలిసిన తబలా, హార్మోనియం కళాకారులను సత్యానికి పరిచయం చేసి, వాళ్లతో కలిసి అతనితో సాధన చేయించాను.

నా పలుకుబడిని ఉపయోగించి కొన్ని బ్యాంకుల్లోనూ, పోస్టల్ క్లబ్‌లోనూ, కాస్మోపాలిటన్ క్లబ్‌లోనూ ఒక్కొక్క ఆదివారం ఒక్కొక్క చోట సత్యంతో ఒక గంటసేపు హిట్టయిన సినిమా పాటలు పాడించాను. ప్రతి ప్రోగ్రాంలోనూ అతను శ్రోతల ప్రశంసలనందుకున్నాడు. అతణ్ణి ఒక బీద కళాకారునిగా పరిచయం చేసి ప్రతి ప్రోగ్రాముకు ఐదు వందల నుంచి వెయ్యి రూపాయల వరకు ఇప్పించాను. సొంత సంపాదనతో సత్యానికి ప్రోత్సాహం, ఉత్సాహం కలిగి తన సాధనను రెట్టింపు చేశాడు. అతను తన కాళ్ల మీద తను నిలబడగలిగినందుకు అతనితో సమానంగా నేను కూడా సంతోషించాను.

కొద్ది రోజుల్లో సత్యం పాటలకు బాగా పేరు వచ్చింది. ఏలూరులో చుట్టుపక్కల ఊళ్లలో శుభకార్యాలకు, ఫంక్షన్లకు అతని పాటల ప్రోగ్రాం కావాలని అడిగించుకునే డిమాండ్ అతనికి వచ్చింది. అతని అదృష్టమేమంటే పాడిన ప్రతి చోటా జనాలు అతణ్ణి చాలా మెచ్చుకున్నారు. కొన్ని రోజుల తర్వాత తన పారితోషకాన్ని రెండు వేల నుంచి మూడు వేల వరకు పెంచాడు. ప్రోగ్రాం సమయం కూడా గంట నుంచి రెండు గంటలకు పెంచాడు. క్రమక్రమంగా అతని పేరు ఆంధ్రరాష్ట్రంలోని అన్ని పట్టణాలకు, నగరాలకు వ్యాపించింది. అతను మీడియా దృష్టిలో పడ్డాడు.

పత్రికావిలేకర్లు అతణ్ణి ఇంటర్వ్యూ చేసి అతని గురించి తమ పత్రికల్లో చాలా గొప్పగా రాసి అతని ఫొటో కూడా వేశారు. టీవీ ఛానెళ్లలో కూడా అతనికి ప్రచారం జరిగింది. చివరికి సినిమా పాటలకు వాయించే ఆర్కెస్ట్రా కళాకారులతో హైదరాబాద్‌లో సత్యం గురించి మాట్లాడాను. మీడియా ద్వారా అతన్ని గురించి విన్న వాయిద్యకళాకారులు అతని పాటల ప్రోగ్రాముల్లో సహకరించడానికి వెంటనే అంగీకరించారు.

మొదటి పెద్ద ప్రోగ్రాం మూడు గంటల సేపు ఏలూరులో ఏర్పాటు చేశాను. వై.యం.హెచ్.ఏ హాల్లో "రబ్బరు గాజులు రబ్బరు గాజులు తెచ్చానే" పాటతో సత్యం తన పాటల కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఆ పాట పూర్తికాగానే శ్రోతల కరతాళధ్వనులతో హాలు మోగింది. తర్వాత శాస్త్రీయ సంగీత పాటను వినిపించి అందరి ప్రశంసలందుకున్నాడు. ఈ విధంగా ఒక లలిత గీతం తరువాత ఒక శాస్త్రీయ గీతం పాడుతూ అటు మాస్‌ను, ఇటు క్లాస్‌ను ఆకట్టుకున్నాడు. ప్రోగ్రామంతా జయప్రదంగా జరిగింది. పారితోషికం యాభై వేల రూపాయలు వచ్చాయి. దాంట్లో పదిహేను వేలు ఆర్కెస్ట్రా మెంబర్స్‌కు, పదివేలు హాలు అద్దెకు పోగా మిగిలిన పాతికవేలు సత్యం చేతిలో పెట్టాను. అతను ఆ డబ్బును నాకు తిరిగి ఇవ్వబోతూ

"ఇదంతా మీరు నన్ను చేరదీసి, పైకి తెచ్చి నాకు పెట్టిన భిక్ష. ఈ డబ్బంతా మీకే చెందాలి" అన్నాడు.

"కష్టపడి పాటలను సాధన చేసి నీ మధురమైన కంఠంతో వాటిని పాడి శ్రోతలను మెప్పించింది నువ్వు. ఆ డబ్బు మీద అర్హత, హక్కు నీకే ఉన్నాయి" అని అతని భుజం తట్టి నేనా డబ్బును అతనికే ఇచ్చాను. అతని ఔన్నత్యం నాకు నచ్చింది.

తరువాత ఆంధ్ర రాష్ట్రంలోని పెద్దపెద్ద నగరాల్లో అతని ప్రోగ్రాములు జరిగాయి. నెలకు మూడు, నాలుగు ప్రోగ్రాముల చొప్పున ఏర్పాటయినాయి. రాష్ట్రమంతా తన పాటలతో ఉర్రూతలూగించి, సత్యం 'గాయకుడు'గా పెద్దపేరు సంపాదించాడు. అనతి కాలంలోనే లక్షలకు అధికారి అయ్యాడు. కొందరు సినిమా ప్రొడ్యూసర్లు డైరెక్టర్లు అతనిలోని కళను గుర్తించి అతనితో తమ సినిమాలలో పాడించారు. సత్యం ఒక మేడ, కారు కొన్నాడు. గృహస్థుడు కూడా అయ్యాడు.

ఒకరోజు సత్యం నా ఇంటికి వచ్చి "పూటకి గతిలేని వాడిగా ఉన్న నన్ను ఇంత ఉన్నతస్థాయికి మీరు తీసుకువచ్చారు. కానీ ఇంతవరకు నాకు వచ్చిన ఏ ఒక్క ప్రోగ్రాం పారితోషకంలోనుంచి ఒక్క రూపాయి కూడా మీరు ఆశించలేదు. అది మీ సంస్కారం, కళ మీద మీకు ఉన్న అపారమైన అభిరుచి. కానీ నా తృప్తి కోసం నేను మీకిచ్చే ఒక బహుమతిని తప్పనిసరిగా తీసుకోవాలి" అని ఒక కొత్త కారు 'కీస్'ని నా చేతిలో బలవంతాన పెట్టాడు. దీనికి నేను కూడా సంతోషంగా అంగీకరించాను. ఎందుకంటే అతణ్ణి తృప్తి పరిచాననే ఒక కారణంతో.

ఎంతపైకి ఎదిగినా, సత్యం ఒదిగేవున్నాడు. అతనిలో గర్వం మచ్చుకైనా కనపడదు. అతనిలో దాగి ఉన్న సంగీత కళకి సానపట్టి మెరుగుపరిచి వెలుగులోకి తీసుకురాగలిగినందుకు నా ఆశయం నెరవేరిందని తృప్తి పడ్డాను. సత్యం గాయకుడిగా పేరు తెచ్చుకున్న 'మట్టిలో మాణిక్యం'.

★

క్రైమ్ కథ

ఆకలి రుణం

- యర్నాగుల సుధాకరరావు

"చట్టంతో ఆడేవాడు మీ ముందు కూర్చున్నాడు. నేను దోచుకుని పోవాలంటే ఆ రోజు వీడింట్లో ముప్పై లక్షల క్యాష్ ఉంది. గోల్డుంది. నేను పదే తీసుకున్నాను. ఇక నాతో తిరిగే జాన్‌కు ఏమీ తెలియదు. ప్లీజ్ వదిలేయండి సార్! మార్వాడి నీవు పోలీసుల ద్వారా నన్ను పట్టుకుంటే నీకు ఆ డబ్బుతో దొరకను. లడ్లు తయారుచేసేడిలా దొరుకుతాను. నాలుగేళ్లు భాషా ఇంట్లో తిన్నందుకు విశ్వాసంతో ఆ కుటుంబానికి ఈ సాయం చేస్తున్నాను. అకలి అనేవాడికి అన్నం పెట్టాలి అనే పద్ధతిలో మానవతావాది భాషా సాగాడు. ఆ ఫ్యామిలీ దగ్గర నీవు తీసుకున్న ఆస్తులు కోటిరూపాయలపై మాటే. నాకంటూ ఎవరూ లేరు. నన్ను పట్టుకోవడం అంత తేలిక కాదు. నేను తప్పుచేయలేదు. అలా చేసుంటే నీ కూతురు నా పక్కనే ఉండేది"

"**వా**డు దుర్మార్గుడని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. నీవు వినలేదు. ఇప్పుడు దొంగతనం కేసులో ఇరుక్కున్నావు. నీ గురించి పోలీస్‌స్టేషన్‌కు రావాల్సి వచ్చింది" జైలులో కొడుకుని చూసి కళ్లనీళ్లతో చెప్పాడు జోసఫ్.

"నాన్నా నాకేం తెలియదు. వాణ్ణి నమ్మాను. ఇంత దుర్మార్గుడని తెలియదు. వాడు ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడని తెలియదు. ఇంత దారుణంగా దోచుకుని పారిపోతాడని నాకేం తెలుసు? మూడురోజులుగా నేను వాడు అసలు కలుసుకోలేదు" కొడుకు జాన్ బాధపడుతూ చెప్పాడు.

"నీ మాటలు నేను నమ్ముతాను. కానీ పోలీసులు నమ్మరు కదా!"

"పోలీసులు అజీజ్ ఎక్కడున్నాడని అడుగుతున్నారు. చెప్పకపోతే ఊరుకోబోమంటున్నారు. నీవు నమ్ము. నాకదే చాలు. చెడ్డవాని మైత్రి ఈరోజు నన్ను జైలులో కూర్చోబెట్టింది. నిలకడ మీద నిజం తెలుస్తుంది. అప్పుడే నేనింటికి వస్తాను"

ఇన్‌స్పెక్టర్ తండ్రీకొడుకుల సంభాషణ విని "జోసఫ్ నీ కొడుకు నిరపరాధి అయితే ఏమీకాదు. ఆ రాస్కెల్ అజీజ్‌తో చేతులు కలిపినట్టు తేలితే మాత్రం చాలా ప్రమాదం" అన్నాడు.

"జాన్ నీ మాటలు ఓకే. నీవు చెప్పిందే నిజమనుకుందాం. నీవు అజీజ్‌తో తిరిగినవాడివి. నీకు చెప్పకుండా దాచడు. అతడు ప్రేమ పేరుతో మార్వాడి కూతురితో క్లోజ్‌గా ఉన్నాడు. మార్వాడి దంపతులు కూతురిని ఇంట్లోపెట్టి పెళ్లికి వెళ్లారు. వారు వచ్చేలోగా అజీజ్ వాళ్లింటికి వెళ్లి ఆమెకు మత్తు టాబ్లెట్ ఇచ్చి పదిలక్షల క్యాష్ తీసుకుని పారిపోయాడు. ఇదేదీ నీకు తెలియకుండా ఉండదు"

"సార్ ఇంతపెద్ద ప్లాన్ వేసిన అజీజ్ నాకు ఏమీ చెప్పలేదు. అతడు ఏనాడూ నేర ప్రవృత్తిగల మాటలు చెప్పేవాడు కాదు. ఎప్పుడూ అమ్మాయిలను కూడా కామెంట్ చేసేవాడు కాదు"

"జోసఫ్ మీ అబ్బాయికి అజీజ్‌తో తిరగొద్దని చెప్పారు. అతనిలో ఏ తప్పులు చూసి మీరలా చెప్పారు?"

"ర్యాష్‌గా మోటార్‌బైక్ నడుపుతాడు. ఒకసారి దాబాలో బీర్ తాగడం చూశాను. ఇంటికి రాగానే వాడితో తిరగకురా అని చెప్పాను. అంతకుమించి అతడిలో నేరగాడిని నేనూ చూడలేదు"

"పదిలక్షలతో పారిపోయినవాణ్ణి దేశంలో ఎక్కడున్నా పట్టి తెస్తాం. ఒక్కడి వల్ల ఇంత పెద్దదొంగతనం జరగదు" ఇన్‌స్పెక్టర్ ఆలోచనలో పడ్డాడు.

అంతలోనే ఫోన్ మోగింది. రిసీవర్ ఎత్తాడు ఇన్‌స్పెక్టర్.

"సార్ అక్కడ నా ఫ్రెండు జాన్ ఉంటే ఒకసారి ఫోన్ ఇవ్వండి"

"ఎవర్నువ్? జాన్‌తో నీకేంటి పని?"

"సార్ నేను పదిలక్షలతో పరారయిన అజీజ్‌ను. నా ఉనికి తెలుసుకోవడానికి జాన్‌ను అరెస్టు చేశారని తెలిసింది.. అతడు నిరపరాధి. దయచేసి వదిలేయండి"

"నువ్వు ఒక ఫ్రాడ్‌వి. నీవు చెబితే వదిలేయాలా? నీవు ట్రెయిన్‌లో ఉన్నట్టున్నావు. ఆ సైరన్ విన్పిస్తోంది"

"సార్, ఇంటర్‌పోల్ ఆఫీసర్ అయిపోవద్దు. నేను ఊరకనే దోచుకోలేదు. అసలు విషయం చెబుతాను. మార్వాడి వడ్డీలకిచ్చి చాలా కుటుంబాలవారి ఆస్తులు దోచుకుని కోట్లాధిపతి అయ్యాడు"

"అయితే నీవు అతణ్ణి దోచుకుని పారిపోతావా?" ఇన్‌స్పెక్టర్ కోపంతో రెచ్చిపోయాడు. సరిగ్గా అప్పుడే మార్వాడి వచ్చి ఎదురు సీటులో కూర్చున్నాడు. ఇన్‌స్పెక్టర్ సెల్ ఓపెన్‌లో పెట్టాడు.

"సార్ నన్ను చెప్పనీయండి. భాషా అనే మిఠాయి వర్తకుడు నన్ను చేరదీశాడు. వారింట్లో ఉంటూ చదువుకుంటుండేవాణ్ణి. అయితే ఆయన ఆకస్మికంగా చనిపోయాడు. ఆ కుటుంబం వ్యాపారంలో రాణించలేదు. అప్పుల పాలయ్యారు. ఆస్తులపై అప్పులు ఇచ్చే మార్వాడి ఐదేళ్లలో వారి ఆస్తులు వడ్డీలకుగాను స్వాధీనం చేసుకున్నాడు. వారు కట్టుబట్టలతో ఊరు వదిలిపోయారు. ఇదంతా నాకు పదేళ్లప్పుడు జరిగిన కథ. నాకు మార్వాడిని చూసినప్పుడు భాషా గుర్తుకువచ్చేవాడు. రక్తం మరిగిపోయేది. రసగుల్లా చేసి నేను చదువుకున్నాను. డిగ్రీ పూర్తి కాలేదు. ఈలోగా మార్వాడి కూతురిని మెల్లగా ప్రేమలోకి దించాను. నేనంటే ఆమెకు చాలా ఇష్టం"

"బద్మాష్‌తో ముచ్చట్లేమిటి? పట్టుకుని వచ్చేయక. వాడిని ఖతమ్ చేయాలి" ఆ మాటలు విన్న మార్వాడి పెద్దగా అరిచాడు.

"ఇన్‌స్పెక్టర్ గారూ! బద్మాష్ మార్వాడి అక్కడే ఉన్నాడా? వాడు వినాలి. రేయ్ నేను నీ దగ్గర దోచుకున్నది కేవలం డబ్బు. అదీ భాషా ఫ్యామిలీకోసం. వారికి ఇవ్వడానికే పోతున్నాను. వారు దుర్భర నరకం అనుభవిస్తున్నారు. ఇక నీ కూతురిని నేను కనీసం తాకలేదు. నాతో వచ్చేయడానికి ఆమె సిద్ధంగా ఉంది. కానీ నాకెందుకు అంత పెద్దింటి బిడ్డ. నేను ఎక్కడోచోట లడ్లు తయారుచేసుకుని జీవించే వాణ్ణి. నేను దొరకను. నువ్వు పోలీసులకిచ్చిన ఫిర్యాదును విత్‌డ్రా చేసుకో!"

"నీవు చట్టంతో ఆడుతున్నావు" ఇన్‌స్పెక్టర్ ఒకింత మెత్తబడ్డాడు.

"చట్టంతో ఆడేవాడు మీ ముందు కూర్చున్నాడు. నేను దోచుకుని పోవాలంటే ఆ రోజు వీడింట్లో ముప్పై లక్షల క్యాష్ ఉంది. గోల్డుంది. నేను పదే తీసుకున్నాను. ఇక నాతో తిరిగే జాన్‌కు ఏమీ తెలియదు. ప్లీజ్ వదిలేయండి సార్! మార్వాడి నీవు పోలీసుల ద్వారా నన్ను పట్టుకుంటే నీకు ఆ డబ్బుతో దొరకను. లడ్లు తయారుచేసేడిలా దొరుకుతాను. నాలుగేళ్లు భాషా ఇంట్లో తిన్నందుకు విశ్వాసంతో ఆ కుటుంబానికి ఈ సాయం చేస్తున్నాను. అకలి అనేవాడికి అన్నం పెట్టాలి అనే పద్ధతిలో మానవతావాది భాషా సాగాడు. ఆ ఫ్యామిలీ దగ్గర నీవు తీసుకున్న ఆస్తులు కోటిరూపాయలపై మాటే. నాకంటూ ఎవరూ లేరు. నన్ను పట్టుకోవడం అంత తేలిక కాదు. నేను తప్పుచేయలేదు. అలా చేసుంటే నీ కూతురు నా పక్కనే ఉండేది"

ఇన్‌స్పెక్టర్ సెల్ ఆపేసి మార్వాడివైపు చూశాడు.

మార్వాడి ఫిర్యాదు వాపస్ తీసుకుని బయటికి నడిచాడు.

జాన్, జోసఫ్‌లు రాణాలోంచి వెళ్లిపోయారు.

★

బాబోయ్ బా.. బా.. లు...

కీచక స్వాములు, బాబాలు, గురువుల బండారాలు ఇటీవల బయట పడ్డాయి. కల్కి ఆశ్రమంలో జరుగుతున్న మత్తు మందులు, ఆ మత్తులో జరిగే వ్యవహారాలు, నిత్యానంద, లిచాధరి బాబాల సెక్స్ రాకెట్ బండారం బయట పడింది. గుర్మిత్ రామ్ రహీమ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.విషాదం ఏమంటే వీరంతా నిరపరాధులని కావాలని, గిట్టని వారు తప్పుడు ఆరోపణలు చేశారని నిందితులను సమర్థిస్తూ మద్దతుదార్ల పేరుతో కొందరు వీధుల్లో వీరంగానికి, విధ్వంసానికి దిగారు.

ఈ ఉదంతాల గురించి చర్చించుకున్న ఒక విద్యావంతులైన యువ బృందం చివరికి ఒక నిర్ణయానికి వచ్చింది. అదేమంటే ఇలాంటి దొంగబాబాలు మంచి వారికి చెడ్డపేరు తెస్తున్నారు అని.

మంచి బాబా పేరు ఒక్కటంటే ఒక్కటి చెప్పండి బాబూ అని ఎవరైనా అడిగితే మాకు తెలియనంతమాత్రాన అసలు లేకుండా ఉంటారా మీకు చెప్పలేంగాని అంటూ తప్పించుకు పోతారు. అలాంటి పలాయనవాదులు పేర్లకీ పుకార్లకీ నిబద్ధులని ఆగ్రహం వ్యక్తం చేయాలా? తాతగారి నాన్నగారి భావాలకు వారసులని జాలిపడాలా? యువతరం ఇలా ఎందుకు తయారౌతోంది?

నిత్యానంద, లిచాధరి బాబాల వంటి వారి బండారం ఇదే తొలిసారికాదు. గతంలో ధీరేంద్ర బ్రహ్మచారి, భగవాన్ రజనీష్, ఇలా అనేక ఉదంతాలు వెల్లడయ్యాయి. బయట పడిన అనేక మంది బాబాల ఉదంతాలన్నీ మగువ, మత్తు, మనీ చుట్టూ తిరిగినవే. నిజానికి ఇలా బయట పడినవి నామమాత్రమే. బయటకు రానివెన్నో. ఇలాంటి వారికి ఇప్పుడు మన దేశంలో ఎన్నడూలేని మంచి మార్కెట్ ఉంది. బాబాలు తమ మాయలకు తత్వాన్ని జోడిస్తారు. పతంజలియోగంలో నీవు ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి పోతే దేహం అనేదానికి ప్రాధాన్యత ఉండదు అని చెబుతారు. కల్కి ఆశ్రమంలో చేరిన వారు ఆ పేరుతోనే మత్తుమందులు తీసుకొని విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని వెల్లడైన అంశం తెలిసినదే. ఒక బాబా నేను కృష్ణుడిగా నీవు గోపికగా మారిపోతావని చెబుతాడు. ఇలా చెప్పుకుంటూ పోతే బాబాల బూతుపురాణాలు అంతం లేని అపూర్వ చింతామణి, కాశీమజిలీ కథలుగా తయారవుతాయి.

ఇలాంటి కుంభకోణాలు, అత్యాచారాలు మన దేశంలోనే కాదు. ఇప్పుడు ఐరోపానూ చర్చ్ పూజారుల సెక్స్ కుంభకోణాలు కుదిపివేస్తున్నాయి. వాటికి సమాధానం చెప్పలేక చివరికి కాథలిక్ చర్చి అధిపతి పోప్ బెండిక్ట్-16 ఐర్లండ్‌లో జరిగిన ఉదంతాలపై క్షమాపణలు చెబుతూ ఒక లేఖ రాశారు. ఇలా లేఖ రాయాలంటే ఎంత ధైర్యం ఉండాలి, అది పోప్‌కే సాధ్యమైందని కొందరు ఆ చర్యను ఆకాశానికి ఎత్తే ప్రయత్నం చేశారు. క్షమాపణ చెబితే సరిపోతుందా, అలాంటి అక్రమాలకు పాల్పడినవారిని చర్చి నుంచి బహిష్కరించాల్సిన అవసరం లేదా అని బాధితుల తరఫువారు మండిపడుతున్నారు. ఇదేదో ఒకరో అరో సమస్య కాదు. మొత్తం వ్యవస్థాగత సమస్యగా తయారైందని జర్మనీలోని మేమే నిజమైన చర్చ్ ప్రతినిధులమనే ఉద్యమ నాయకుడు వెస్నర్ వాపోయారు. అక్రమాలకు పాల్పడిన బిషప్పులను తొలగించి, పోలీసులకు అప్పగించకపోతే అలాంటి వారిని ప్రోత్సహించినట్లే అవుతుందని అనేక మంది విమర్శిస్తున్నారు. సంక్షోభంలో చిక్కుకున్న కంపెనీ సిగ్గుపడి తప్పుచేసిన తన మేనేజర్లను తొలగించకపోతే అది విచ్ఛిన్నమైనట్లుగానే చర్చి వ్యవస్థ కూడా తయారౌతుందని వియన్నా నుంచి వెలువడే 'డై ప్రెస్సె' వ్యాఖ్యానించింది.

బాబాలు, గురువుల వద్దకు వెళుతున్నవారి సంఖ్య ఈ కాలంలో మరీ ఎక్కువైంది అన్న మాట తరచుగా మనం వింటున్నాం. దీనికి కారణం ఏమిటి?

మన పురాణాల్లో ఒక రుషి ఉన్నాడంటే రుషి పత్ని కూడా వెంటే కనిపిస్తుంది. పత్నులు లేని రుషులు తరువాత వచ్చారు. వారితోనే చిక్కు వచ్చి పడింది. మన దేశంలో బౌద్ధ మతానికి వ్యతిరేకంగా దాడి జరిపిన శంకరుడు బౌద్ధంలోని అనేక అంశాలను ఉపయోగించుకున్నారు. భౌతిక సుఖాలను వ్యతిరేకించటం దానిలో ఒకటి. ఆధ్యాత్మికత ఉన్నత స్థాయికి వెళితే దేహం నిమిత్తమాత్ర మౌతుందని పతంజలి చెప్పారు. సమాజంలో బౌద్ధ సన్యాసులకు ఉన్న గౌరవాన్ని చూసి ఇతర మతాల్లో కూడా సన్యాసులు, సన్యాసినులు బయలు దేరారు. హిందూత్వ వారసులుగా చెప్పుకొనే ఆర్ఎస్ఎస్ కూడా బ్రహ్మచర్యాన్ని ప్రోత్సహిస్తుంది. సంజయ్ జోషి అనే ఆ సంస్థ ప్రచారక్ నిండా శృంగారంలో మునిగి ఉండగా చిత్రించిన సిడీలు దేశవ్యాపితంగా పంపిణీ అయిన విషయం తెలిసినదే. అనేక మంది ప్రచారక్‌లుగా ప్రారంభమై తట్టుకోలేక గృహస్తులుగా మారిన వారు ఎందరో ఉన్నారు. బిజెపి నుంచి బహిష్కరణకు గురైన బ్రహ్మచారి గోవిందాచార్య, సన్యాసిని ఉమాభారతి ప్రేమ వ్యవహారం కూడా బహిర్గతమే.

తెలుగునాట భక్తిరసం డ్రైనేజి కాలువలై డేంజరుగా మారటానికి ఒక ముఖ్య కారణం పెట్టుబడిదారీ విధానం మరింతగా పెరగటం అంటే ఆశ్చర్యం పడవద్దు. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు అనేక మంది గురువులు, బాబాలను రప్పించి తమ సిబ్బందికి తరగతులు నిర్వహించటం బహిరంగ రహస్యం. మన రాష్ట్ర సిఇఓ అని చెప్పుకున్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇలాంటి వెర్రిమొర్రి వేషాలన్నీ వేయించారు. వినిమయ సంస్కృతి విస్తరించితే తప్ప పెట్టుబడిదారులకు మార్కెట్ పెరగదు. అందుకు డబ్బు అవసరం. డబ్బు సంపాదించినవారే గొప్ప. ఎలా సంపాదించారనేదానితో నిమిత్తం లేదు. సంపాదించటం చేతగాని ప్రతివాడూ డబ్బుతో పనిలేదని కబుర్లు చెబుతాడంటూ రెచ్చగొట్టటం కూడా ఒక వ్యూహంలో భాగమే. డబ్బు యావలో పడి యంత్రాల్లా మారినవారు, డబ్బు ఎండమావుల వెంటపడి నిరాశపడిన వారు, ఆర్థిక సంక్షోభంతో దివాలా దీసినవారు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారలేని వారు వత్తిళ్లకు లోనై బాబాలు, గురువులను ఆశ్రయించటం. ఇలాంటి వారిలో అత్యధికులు మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి, ధనికులే నూటికి తొంభైశాతం మంది ఉంటున్నారు. అయ్యా ఇదీ సంగతి !!

-సత్య

చూద్దామా

మైమరపించే ముస్సోరి

ఎన్నిసార్లు చూసినా మళ్లీ మళ్లీ చూడాలనిపించే ప్రదేశం అది. చల్లని పిల్లగాలులు మృదువుగా తాకుతూ ఉంటాయి. ఆ మట్టి సుగంధభరితమైన వాసనను వెదజల్లుతుంది. వింత వింత పక్షులు వీనులవిందు చేసే సంగీతాన్ని అందిస్తాయి. ఆ ప్రదేశం దగ్గరకు వస్తుందనగానే దేవదారు చెట్ల సువాసనలు పర్యాటకులను మైమరిపిస్తాయి. ఆ సుందర ప్రదేశమే ముస్సోరి.

ముస్సోరి నగరం చాలా చిన్నదైనా చక్కగా తీర్చి దిద్దినట్టుంటుంది. ఇది ఒక ప్రాచీన నగరం. స్థానికులు దీనిని మా-సూ-రి అంటారు. మాన్సుర్ అనే తుప్పల్లో వారు పశువులను మేపేవారు. అందుకే ఈ ప్రాంతానికి ఆ పేరు వచ్చింది.

కళ్లవత్తిడిని తగ్గిస్తాయి...

ముందుకు చొచ్చుకుని వచ్చిన పెద్ద రాళ్ల, నీలం, ఎరుపు రంగులలో వివిధ రకాల పూలను దగ్గరగా చూసినప్పుడు ఎంతో ఆనందంగా ఉంటుంది. ముస్సోరి చుట్టుపక్కల ఉన్న కొండలు ఆకాశాన్ని తాకుతున్నాయా అనిపిస్తాయి. అవి అధిరోహించే సమయంలో వాటి అందం పర్యాటకులను ముగ్ధులను చేస్తుంది. అడుగడుక్కీ మన చుట్టూ పరుచుకుని ఉన్న పచ్చపచ్చని దృశ్యాలు మారుతూ ఉంటాయి. ఆ సమయంలో మోమును తాకే చల్లని గాలులు మనసును ఎంతగానో ఆహ్లాదపరుస్తాయి. ఎక్కడికో తీసుకెళ్లిపోతాయి. కాంక్రీటు వనాల్లో బంధీలైన పట్టణవాసులకు ఈ పచ్చటి వాతావరణం కళ్ల వత్తిడిని తగ్గిస్తుందంటే ఆశ్చర్యం కాదు.

అతిపురాతన కళాశాల

అక్కడి పర్వత పంక్తిపై 150 సంవత్సరాల క్రితం నిర్మించిన సెయింట్ జార్జ్ కాలేజ్ ఇప్పటికీ సుందరంగా ఉంటుంది. దీన్ని ఐరిష్‌వారు నిర్మించారు. అక్కడి నుంచి కిందికి చూస్తే ఆ ఏటవాలు ప్రాంతాలలో పెరిగిన చెట్లు కంటికింపుగా ఉంటాయి. ఈ అద్భుత నిర్మాణానికి ఎదురుగా జయ్ పీ నిలయం 'మనోర్' శ్వేతసౌధంలా మెరుస్తూ ఉంటుంది. అది గంధర్వ కథల్లో ఉండే కోటను తలపిస్తుంది. ముఖద్వార మార్గానికి ఇరువైపులా ఔషధసంబంధ మొక్కలు ఉంటాయి. హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థపదార్థాలను ఆ మొక్కలకు ఎరువుగా వేస్తారు. కోట తొలిగది గోడలు 30 అడుగుల ఎత్తులో ఉంటాయి. ఇవి అందమైన పరదాలతో ఎంతో చక్కగా అలంకరించి ఉంటాయి. అందులో ఉన్న అతిపురాతన పియానో ఆ గదికి మరింత అందాన్ని ఇస్తుంది. రెండో అంతస్తులో దర్శనమిచ్చే స్పా, స్విమ్మింగ్‌పూల్ చాలా బాగుంటాయి. అక్కడే ఉండిపోవాలనిపిస్తుంది. ఆ కోట నుంచి బయటికి వెళ్లడానికి ద్వారం ఉంది. అక్కడ వేల్లాడే మందపాటి పరదాల్లోంచి బయటికి రావడం ఓ మరపురాని అనుభూతి. ఇక్కడి నుంచి ఎంచక్కా టెర్రాస్ మీదకు వెళ్లొచ్చు. అక్కడ వత్తైన పచ్చటి గడ్డి, అక్కడక్కడా కూర్చోవడానికి కుర్చీలు... చూడడానికి ఎంతో ముచ్చటగా ఉంటుంది. ఇంకా స్కేటింగ్, యోగా స్థలాలు, పిల్లల ఆట స్థలం ఉన్నాయి. ఆ టెర్రాస్ చుట్టూ పరుచుకున్న ప్రకృతి సౌందర్యానికి అంతే లేదు. ఈ కోట మీద నుంచి చూస్తే ఆ ప్రకృతి దృశ్యాలు చాలా అద్భుతంగా, ఉత్కంఠభరితంగా కనిపిస్తాయి. అక్కడ భారతీయుల, చైనీయుల వంటలు ముఖ్యంగా దక్షిణ భారత్‌లో చేసే ఊతప్పం,



సెయింట్ జార్జ్ కాలేజ్



గన్ హిల్



మాల్ రోడ్

పొంగలి లభిస్తాయి.

గంటలు సెకన్లలా...

చలికాలంలో అక్కడికి వెళ్తే మరిన్ని అద్భుతాలు చూడొచ్చు. ఓక్ చెట్ల ఆకుల మీద గూళ్లు కట్టుకున్న స్థానిక పక్షులు కిలకిలారావాలతో నిద్ర లేపుతాయి. తెల్లవారుజామున పొగమంచుతో కూడిన దృశ్యాలు పర్యాటకుల దృష్టిని ఎంతగానో ఆకర్షిస్తాయి. ఒకవైపు చలికి శరీర భాగాలు తిమ్మిర్లెక్కి వంకర్లు తిరిగిపోతున్నా అవేం పట్టించుకోకుండా ఆ ప్రకృతి సౌందర్యారాధనలో లీనమవుతారు. ఆ మంచు తెరలు ఎప్పుడు మాయమవుతాయా... ఎప్పుడెప్పుడు ఆ అందాలను పూర్తిగా దర్శిద్దామా అన్నంత ఆత్రుత చోటుచేసుకుంటుంది. కొండలు, వాటిపై పచ్చని చెట్లు, వాటిని తాకుతున్నాయా అనిపించే ఆకాశం, కదులుతున్న మబ్బులు... ఎంత చెప్పినా తక్కువే. కళ్లారా చూసి తరించాల్సిందే. సూర్యుడు నెమ్మదిగా పర్వతాల నడుమ నుంచి వస్తుంటే చల్లని గాలులు బలంగా మారతాయి. అక్కడ ఇట్టే సమయం గడిచిపోతుంది. గంటలు సెకన్లలా గడిచిపోతాయి. ఒక్కసారిగా చీకటి అయినట్లనిపిస్తుంది. పక్షుల కిలకిలారావాలు ఆగిపోతాయి. నగరమంతా విద్యుద్దీపాలతో ప్రకాశిస్తుంది. ఆ ఎత్తైన కొండల నుంచి పారే జలపాతం, గలగల శబ్దం చేస్తూ పక్కనే గల అడవిలోకి పారే ఆ నీరు మెరుస్తుంటాయి.

ఒంటె ఆకారపు కొండ

అక్కడ చూస్తుండగానే వాతావరణం మారిపోతుంటుంది. స్థానికులు దాన్ని పసిగట్టి అందుకు తగిన దుస్తులు ధరిస్తారు. అక్కడి నుంచి 20 నిమిషాలు ప్రయాణం చేస్తే ట్రాంక్విల్ క్యామెల్ రోడ్ వస్తుంది. అక్కడ ఒక కొండ మీద వివిధ రకాల వృక్షజాతులు ఒక క్రమ పద్ధతిలో ఉంటాయి. ఆ కొండ పైభాగానికి మెటల్ రోడ్ ఉంటుంది. వచ్చేపోయే వాహనాలతో ఇబ్బంది లేకుండా ఉండడానికి దాన్ని వన్ వే రూట్‌గానే ఉపయోగిస్తారు. ప్రయాణికులు తప్పనిసరిగా ఒక దగ్గర ఆగుతారు. ఒంటె ఆకారంలో ఉండే కొండ దగ్గర. అది పర్యాటకులను ఎంతగానో ఆశ్చర్యపరుస్తుంది.

వైట్ స్టోర్స్

సిస్టర్ బజార్ రోడ్‌లో ఒక ముఖ్యమైన ప్రదేశముంది. దాన్ని వైట్ స్టోర్స్ అంటారు. అక్కడ ఒక చిన్న షాపు 100 సంవత్సరాల నుంచి ఉంది. ప్రణయ్ రాయ్, సచిన్ టెండుల్కర్ ముస్సోరి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడికి వెళ్తారు. రస్కిన్ బాండ్ వంటి వారు ఏకంగా తమ ఇళ్లనే ఇక్కడ కట్టుకున్నారట. ఇక్కడ రుచికరమైన, ఆరోగ్యకరమైన పదార్థాలు లభిస్తాయి.

సైనిక స్థావరాలు

ఒంటె ఆకారంలో ఉన్న కొండకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న వలసదేశాల నివాసాలను చేరగానే సైనిక స్థావరాల దగ్గరికి వచ్చినట్టు తెలుస్తుంది. అది చాలా చిన్న పట్టణమైనప్పటికీ విదేశీయులను ఎంతగానో ఆకర్షిస్తుంది. ఆ సైనిక స్థావరాలు ఒక పెద్ద గుట్ట మీద ఉంటాయి. ఆ గుట్ట 7000 అడుగుల వాలు కలిగి ఉంటుంది. అక్కడ ఊపిరి కూడా పీల్చుకోనీకుండా ఆకర్షించే దృశ్యాలు అనేకం పర్యాటకులను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అక్కడే గంగోత్రి, యమునోత్రి, నందాదేవి వంటి నదీ ప్రవాహాలను మనం చూడొచ్చు. మసాజ్, ఆవిరిస్నానం ఇక్కడి రిసార్టు ప్రత్యేకతలు. మంచి భోజనం కూడా.

ముఖ్యమైన ప్రదేశాలు

మాల్ రోడ్

ముస్సోరిలో అతి ముఖ్యమైన వాణిజ్య కేంద్రమిది. ఇక్కడ వరుసగా షాపులుంటాయి. అందులో కేమ్‌బ్రిడ్జి బుక్ స్టోర్ ఉంటుంది. రస్కిన్ బాండ్, టామ్ ఆల్టర్ తరచుగా దాన్ని సందర్శిస్తుంటారు. ఇంకా అక్కడ పాలిపోయిన ఆకుపచ్చని రంగులో పాత గ్రంథాలయం, ఎస్‌బిఐ బిల్డింగ్, స్వీట్ షాపు ఉన్నాయి. దానికి కుడివైపుగా డెహ్రాడున్ పట్టణంతో సహా కింది హిమాలయాల అందాలను చూస్తుంటే ఆ సాయంత్రం స్వర్గంలో ఉన్నట్టుగా ఉంటుంది.

కెంప్టీ ఫాల్స్

60 అడుగుల ఎత్తు నుంచి ఉరకలు వేస్తూ వచ్చే నీటి ప్రవాహాలను చూసి తీరవలసిందే. ఏటవాలు రాళ్లపై వెండి తీగల్లా మెరుస్తూ ఉంటాయి. ఒక మైలు దూరం వరకు ఆ జలపాతం హోరు వినిపిస్తుంది. కేబుల్ కార్ గురించి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వృద్ధులు, మోకాళ్ల నొప్పులున్నవారికి ఇది వరప్రసాదమనే చెప్పుకోవాలి. ఇందులో ఎంచక్కా వచ్చి అందాలను ఆస్వాదించొచ్చు.

గన్ హిల్

ముస్సోరిలో రెండవ అతి ముఖ్యమైన ప్రదేశం గన్ హిల్. ముస్సోరి నుంచి గన్ హిల్‌కు 400 మీటర్లు తాళ్లతో చేసిన దారి ఉంటుంది. స్వాతంత్ర్యానికి పూర్వం మధ్యాహ్న సమయాన్ని ప్రకటించడానికి ఈ గన్ హిల్‌పై అమర్చిన తుపాకీని పేల్చేవారు. దాన్ని బట్టి స్థానికులు సమయాన్ని తెలుసుకునేవారు. బద్రపంచ్, శ్రీకాంత్, గంగోత్రి సమూహాన్ని కూడా ఇక్కడి నుంచి చూడొచ్చు.

కంపెనీ గార్డెన్

దీన్ని బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు ఏర్పాటు చేశారు. అక్కడ స్ప్రాలింగ్ పార్కులో వివిధ రకాల కూరగాయల, పూల మొక్కలు ఉంటాయి.

ముస్సోరి డెహ్రాడున్ నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఢిల్లీ నుంచి 290 కిలో మీటర్లు ఉంటుంది. ఎక్కడి నుంచైనా ట్రెయిన్ సౌకర్యాలున్నాయి. స్థానికంగా అనేక ప్రయివేటు టాక్సీలు ఉంటాయి.

ముస్సోరి సముద్ర మట్టం నుంచి 3000 మీటర్ల ఎత్తులో ఉంటుంది. అక్కడ వాతావరణం సంవత్సరమంతా ఆహ్లాదకరంగా ఉంటుంది. జులై మధ్యలో నుంచి సెప్టెంబరు మధ్య వరకు వర్షాలు, నేలకోతలు అధికంగా ఉంటాయి. అందువల్ల ఆ మధ్యలో ముస్సోరి ప్రయాణం పెట్టుకోకపోవడం మంచిది.

కంపెనీ గార్డెన్



కెంప్టీ ఫాల్స్



ఒంటె ఆకారపు కొండ

కొత్త పుస్తకాలు

నీటి ప్రయివేటీకరణ నిజస్వరూపం

భారతదేశంలో నీటి రంగం ప్రయివేటీకరణ వేగం పుంజుకుంటోంది. పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు నీటి సరఫరా క్రమంలో మెరుగుదల సాధిస్తుందనీ నీటి రంగం నేడు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలన్నిటికీ ఇదే పరిష్కారమనీ, ఈ ప్రయివేటీకరణ క్రమాన్ని పాలకులు సైతం సమర్థిస్తున్నారు. ఇదే సమయంలో అనేక రాష్ట్రాల్లో నీటి రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టి ఆ రంగాన్ని ఒక వాణిజ్య వ్యాపారంగా మార్చి మార్కెట్ శక్తుల చేతిలో పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వెలువడిన పుస్తకం 'నీటి ప్రైవేటీకరణ–పథకాలు–ప్రమాదాలు'. దీన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు ముద్రించారు. నీటి ప్రయివేటీకరణ, వ్యాపారీకరణలోని కీలకాంశాలు, ప్రపంచవ్యాప్తంగా ప్రయివేటీకరణ క్రమంలో ఇచ్చే హామీలు, వస్తున్న అనుభవాలు, దేశంలోని ప్రయివేటు ప్రాజక్టుల పరిశీలన, సంస్కరణల క్రమంలో నీటి రంగం వాణిజ్యపరం అయితే వచ్చే పరిణామాల స్థూల స్వరూపం, ప్రయివేటీకరణ–వ్యాపారీకరణ దుష్ఫలితాలు–పెరుగుతున్న వ్యతిరేకత, ప్రయివేటీకరణ క్రమంలో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల పాత్ర,



నీటి ప్రైవేటీకరణ
పథకాలు-ప్రమాదాలు,
ధర: 40/-, పేజీలు: 132, ప్రతులు దొరుకుచోటు:
ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి,
హైదరాబాద్-20. ఫోన్: 27660013.

ప్రయివేటీకరణకు ప్రత్యామ్నాయ పథకాలపై మంథన్ అధ్యయన కేంద్రం అనే సంస్థ అధ్యయనం చేసి ఆంగ్లంలో పుస్తకంగా తీసుకొచ్చింది. 2007లో ఈ పుస్తకాన్ని తాజాపరచి పునర్ముద్రించారు. జరుగుతున్న పరిణామాలను క్రోడీకరిస్తూ, తద్వారా ఏం జరుగుతుందో ఎవరెవరు దీనిలో పాత్రధారులై వున్నారో తెలియపరచడం ఈ పుస్తకం లక్ష్యం. నీటి ప్రయివేటీకరణలోని వివిధ అంశాలను లోతుగా విశ్లేషించడం ఈ పుస్తకం చేయదు. కానీ ముఖ్యమైన ధోరణులనూ, వాటి ఫలితాలనూ తెలియపరుస్తుంది. వివిధ వనరుల నుంచి సేకరించిన సమాచారాన్ని పొందుపరిచినది ఈ చిన్ని పుస్తకం. మన ఆర్థిక వ్యవస్థ పరంగానూ, ప్రత్యేకించి నీటి రంగానికి సంబంధించి మనం అర్థం చేసుకోవాల్సిన పరిస్థితిని వివరిస్తుందీ పుస్తకం. మన రాష్ట్రంలో కూడా నీటి ప్రయివేటీకరణ ప్రయత్నాలు ఊపందుకుంటున్న తరుణంలో ఈ పుస్తకాన్ని చదవాల్సిన అవసరం నేడు ఎంతైనా వుంది.

-స్నేహ

కీలు బొమ్మలు

కీలు బొమ్మలు (నవల)
రచన : జి.వి. కృష్ణారావు
పేజీలు : 204,
వెల : 100/-,
ప్రతులకు :
అశోక్ బుక్‌సెంటర్, 13-1-1సి
జగదాంబ జెంక్షన్,
విశాఖపట్నం-530002.
అక్షర, హైదరాబాద్. 23554096.



ఇరవయ్యో శతాబ్దంలో వెలువడిన గొప్ప తెలుగు నవలల్లో ఇది ఒకటి. ఈ 'కీలుబొమ్మలు' స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గ్రామ సీమల్లో నివసించే వారి జీవితం పట్టుదలలు, ఆస్తులపై పెంపు, కట్టుబాట్లు, సాంప్రదాయాలు... స్వతంత్ర ఆలోచన, ధర్మనిరతి, గ్రామీణ వ్యక్తుల ఆప్యాయతలు... కృష్ణా, గుంటూరు జిల్లాల తియ్యటి తెలుగు భాషా సౌందర్యం ఈ నవల్లో గుబాళించింది.

సాధారణ రైతు పుల్లయ్య. ఆయన భార్య లక్ష్మమ్మ, కుమార్తె సీత, కొడుకు రామారావు. ఉపాధ్యాయుడైన చంద్రశేఖర్, అతని భార్య లలిత లపై కథ కథనం సాగుతుంది. ఐదువేల బాకీకి షూరిటీగా శేఖర్‌కు పుల్లయ్య వుండడం... అది అందరికీ తెలియడం... ఇలా ఆరంభమై 35 అధ్యాయాలుగా చక్కటి గ్రామీణ వాతావరణం, పైరు పంటలతో, పాడి పశువులతో గ్రామీణ జీవన దృశ్యాల్ని ఆనాటి పరిస్థితుల్ని రచయిత కళ్లకు కట్టినట్లు రాశారు.

కమ్యూనిస్టుగా మారిన కొడుకు రామారావుని చూసి పుల్లయ్య బాధపడడం, వ్యతిరేకించడం వాస్తవంగా (నాటిస్థితి) చూపినా... రామారావు పాత్ర కృషిని... వ్యవసాయ కార్మికుల్లో కలిగించిన చైతన్యం కార్మికుల్లో కలిగించిన చైతన్యం కార్మికోద్యమాలు గ్రామాల్లో నాటి కమ్యూనిస్టుల కృషిని శాస్త్రీయంగా హేతుబద్ధంగా అధ్యయన, అభ్యుదయ దృష్టితో రాస్తే నవల మరింత బాగుండేది. అధ్యాపకులు చంద్రశేఖరానికి, ప్రజావైద్యుడైన డాక్టరుకు, ప్రజాసేవ చేసే రామారావులాంటి వారికి ఆ రోజుల్లోనే వ్యతిరేకత వుందనే అంశాన్ని పరోక్షంగా చూపిన తీరు బాగానే వుంది. డా॥జి.వి. కృష్ణారావుగా ప్రసిద్ధికెక్కిన శ్రీ గవిని వేంకట కృష్ణారావు(1914–1979) నవల 'కీలు బొమ్మలు' ప్రచురించిన అలకనంద ప్రచురణల సంస్థకు అభినందనలు.

- తంగిరాలచక్రవర్తి





ఏం మాయ చేశారో గానీ...

ఈ చిత్రాలను చూస్తుంటే మీకేమనిపిస్తోంది? అదే బాస్! ఆకాశంలో విశ్రమిస్తున్న మహిళ, రెండు వేళ్ల మధ్య బంధించిన ఈఫిల్ టవర్, ఓ మనిషిని ఒక చేతితో అమాంతం పైకి లేపడం, అరచేతిలో ఇమిడిపోయిన భవనం, కారును అవలీలగా ఎడమచేతితో పట్టుకోవడం, రాకెట్‌ను అమాంతం మింగేయాలని ప్రయత్నించడం, పెద్ద ఎలుగుబంటి ఒక అమ్మాయిని ముద్దు పెట్టుకోవడం, పుష్పాన్నే వస్త్రంగా చుట్టుకున్న అమ్మాయి... ఇవన్నీ ఎలా సాధ్యం? ఏంటీ మాయా... అనిపిస్తోందా? నిజమే మీరు చెప్పినట్టు ఇదంతా మాయే! 'ఫోటోషాపు'తో చేసినదీ మాయ. కొందరి బుర్రలు ఎప్పుడూ ఏదో ఒక అద్భుతాన్ని సృష్టించాలని తపిస్తుంటాయి. అటువంటి అరుదైన బుర్రల నుంచి తొంగి చూసిందే ఈ మాయాజాలం. ఏదేమైనా అసాధ్యాన్ని ఈవిధంగానైనా సుసాధ్యం చేసిన మాయావులకు అభినందనలు చెప్పాల్సిందే మరి!

తగిన శాస్తి

కేసరి కుమార్ తుంటరి పిల్లవాడు. పదమూడేళ్లుంటాయి. బాణాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతుండేవాడు. కేసరి ఒక్కడే సంతానం కావడం వల్ల తల్లిదండ్రులు అతి గారాబం చేసేవారు. అందుకే కేసరికి తోటి పిల్లలతో మొండిగా ప్రవర్తిస్తూ, గేలి చేయడం, అల్లరి చేయడం దినచర్యగా మారిపోయింది.

బాటసారుల బట్టలపైన బురద చిందేటట్లు బురద గుంటలోకి రాళ్లు విసిరి తుర్రుమనేవాడు.

ముళ్ల పొదల్లో కళ్లు తెరవని కుక్క పిల్లల్ని కర్రలతో పొడిచి అవి బాధగా అరుస్తుంటే వాటి అరుపుల్ని అనుసరిస్తూ ఆనందించేవాడు.

ఉపాధ్యాయులు ఎన్నిసార్లు మందలించినా తన ప్రవర్తన మార్చుకునేవాడు కాదు. కొడుకు ప్రవర్తనకు జరగబోయే పరిణామాలను తలచుకుని తల్లిదండ్రులు కలత చెందేవారు.

•••

ఓ రోజు కేసరి బడికి వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న చింత చెట్టు చిటారు కొమ్మల్లోని కాకి గూటిని గమనించాడు. కట్టెపుల్లల్తో కట్టిన గూటిలో వచ్చీరాని శబ్దాలతో కాకి పిల్లల అరుపులు వింతగా విన్పించేసరికి, ఎలాగైనా కాకి పిల్లల్ని పట్టుకుని వాటితో ఆడుకోవాలనుకున్నాడు కేసరి. అనుకున్నదే తడవుగా చకచకా చెట్టెక్కి చిటారు కొమ్మల్లోకి చేరుకున్నాడు. భయం భయంగానే కాకి గూట్లోకి తొంగి చూసి తల్లి కాకి లేదని నిర్ధారించుకున్నాడు. తల్లికాకి రాకముందే కాకి పిల్లల్ని పట్టుకుని పారిపోవాలన్నది వాడి ఆలోచన. కాకి గూట్లోకి చెయ్యి పెట్టి పిల్లని పట్టుకుంటుండగానే ...పిల్లలన్నీ ఒక్కసారిగా గొంతు పెంచి అరవడం మొదలు పెట్టాయి.

ఎక్కడికో దూరంగా ఆహారం కోసం వెళ్లిన తల్లికాకి తన పిల్లల అరుపులు విని "కావు కావు"మంటూ రివ్వున ఎగురుకుంటూ రావడం కేసరి కంటపడింది. "చచ్చాన్రా నాయనా" అనుకుంటూ... ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గబగబా చెట్టు దిగి పరుగు లంకించుకున్నాడు.

తల్లి కాకి అరుపులు విన్న మరికొన్ని కాకులు గుంపులు గుంపులుగా పారిపోతున్న కేసరి వెంట పడ్డాయి. అవి కేసరిని గోళ్లతో రక్కడం, ముక్కులతో పొడవడం మొదలుపెట్టాయి. కాకుల బాధ భరించలేక కర్రలతో, చేతులతో విదిలించినా... కాకుల మూక దాడి చేయడం మానలేదు. కేసరి శరీరమంతా గాయాలతో రక్తం కారుతూ పుండులా తయారైంది. శక్తినంతా కూడదీసుకుని మరింత వేగంగా పరుగెత్తాడు. అయినా కాకులు కేసరి వెంట పడుతూనే వున్నాయి.

పరిగెత్తీ పరిగెత్తీ అలసిపోయిన కేసరి పడుతూ లేస్తూ గాయాల బాధకు తట్టుకోలేక

"కాపాడండీ... కాపాడండీ..." అంటూ దీనంగా విలపిస్తూ బడి దగ్గరకు చేరుకున్నాడు.

అనుకోకుండా జరిగిన పరిణామానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు బిత్తరపోయి చూస్తుండగానే తరగతి గదిలోని బల్లకింద దాక్కున్నాడు కేసరి. బడిలోకి దూసుకొస్తున్న కాకుల మూకను బెదరగొట్టేందుకు పిల్లలంతా కేకలేసి గోల చేశారు. పిల్లల అరుపులకు భయపడిన కాకులు ఒక్కొక్కటిగా వెనక్కు వెళ్లిపోయాయి. నిదానంగా విషయం తెలుసుకొని, మూగ జీవాలను హింసించినందుకు తగిన శాస్తి జరిగిందని చెప్పి ఆ తుంటరి కేసరికి ప్రథమ చికిత్స చేశారు ఉపాధ్యాయులు.

-పోతగాని సత్యనారాయణ